
వార్త
ఆదివారం
23 జులై, 2023
కాస్ట్‌లీ పెళ్లిళ్లు
కష్టాల కావిళ్లు



తారాతీరం

# సెప్టెంబరులో 'ఖుషి' చిత్రం విడుదల

విజయ్ దేవరకొండ, సమంత నాయకా, నాయికలుగా 'ఖుషి' చిత్రం రూపొందింది. మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించిన ఈ సినిమాకి శివ నిర్వాణ దర్శకత్వం వహించాడు. ప్రేమకథా చిత్రాలను మంచి ఫీల్‌తో తెరకెక్కించగలడనే పేరు శివ నిర్వాణకి ఉంది. తనదైన శైలిలో ఆయన రూపొందించిన ఈ సినిమా సెప్టెంబరు 1వ తేదీన విడుదల కానుంది. సచిన్ ఖేడేకర్, జయరామ్, మురళీశర్మ, వెన్నెల కిశోర్, లక్ష్మి ముఖ్యమైన పాత్రలలో కనిపించనున్నారు.



# కొత్త దర్శకుడు శౌర్యువ్‌తో నాని సినిమా

నాచురల్ స్టార్ నాని 'దసరా' చిత్రంతో పాన్ ఇండియా స్టార్ అయిపోయాడు. వరుస సినిమాలతో బిజీగా ఉండే నాని ప్రస్తుతం తన 30వ చిత్రంలో నటిస్తున్నాడు. శౌర్యువ్ అనే కొత్త దర్శకుడితో ఈ సినిమా చేస్తున్నాడు. 'సీతారామం' ఫేం మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఫైనల్ చేశారు. ఈ చిత్రంలో నాని కూతురుగా బేబి కైరా ఖన్నా నటిస్తోంది. ఈ సినిమాను వైరా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, మూర్తి కేఎస్ నిర్మిస్తున్నారు. మలయాళ చిత్ర పరిశ్రమకు చెందిన హేషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు.

ఆదివారం వార్త

23 జులై, 2023

## మంచి ముత్యాలు

ప్రేమ అన్నింటినీ జయిస్తుంది. అది విశ్వవిజేతల హృదయాలనైనా శాశ్వతంగా బంధించి వేస్తుంది.

అశోక చక్రవర్తి

## విషయ విశేషం

రాళ్లకు ప్రాణం.... 4

'సంఘీ'భావం....5

కృత్రిమ మేధతో మనుగడకు ముప్పు

కవర్ స్టోరీ..6

కాస్ట్లీ పెళ్లిళ్లు

కష్టాల కావిళ్లు

మార్కెట్లో కొత్తగా..11

ఈవారం కవిత్వం..12

పక్క చూపులు

వీటితో మరింత సులభం...14

కథ.. 20

పుస్తకాలు కొంటాం

సాహిత్యం..24

మహాకవి డా॥ సినారె

శిల్పకళా భాండాగారం 'అంగ్‌కోర్‌వాట్'...26

ఇంటర్‌సిటీ ప్యాసింజర్....30

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం

వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## ప్లాస్టిక్‌ను తినే జీవులు



రోజురోజుకీ భూమిని చెత్తకుండీలా మార్చేస్తోన్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడానికి ఎన్ని చర్యలు చేపడుతున్నా అది పెరుగుతుందేగానీ తగ్గడం లేదు. 2020 నాటికే ప్రపంచవ్యాప్తంగా ఏటా ఉత్పత్తవుతోన్న ప్లాస్టిక్ ఉత్పత్తి 367 మెగాటన్నులకు చేరినట్లు అంచనా. అయితే ఇటీవల ఆల్ఫైన్, ఆర్కిటిక్ ప్రాంతాల్లో గుర్తించిన కొన్నిరకాల బ్యాక్టీరియా, ఫంగై జీవులు ప్లాస్టిక్కుని జీర్ణం చేసుకుంటున్నాయని గుర్తించారు స్విట్జర్లాండ్ పరిశోధకులు. ఈ జీవుల నుంచి ఉత్పత్తియ్యే ఎంజైమ్‌లు ప్లాస్టిక్‌ని పూర్తిగా విచ్ఛిన్నం చేసి నేలలో కలిసిపోయేలా చేస్తాయట. కాబట్టి ఆ ఎంజైమ్స్‌ని, ప్రయోగశాలలో భారీయెత్తున తయారుచేసి, తగినంత తక్కువ ఉష్ణోగ్రత దగ్గర ఉంచితే ప్లాసిక్కుని కరిగించవచ్చు అంటున్నారు. దీనికోసం వీళ్లు ఆయా శీతల ప్రాంతాల్లో ప్లాస్టిక్కుని వేసినచోట 19రకాల బ్యాక్టీరియా, 15 రకాల ఫంగస్ జాతుల్ని గుర్తించారు. ఆ తరువాత మరింతగా పరిశీలించి ఎక్కువ శాతం ప్లాస్టిక్కుని విచ్ఛిన్నం చేయగలిగిన రెండురకాల బ్యాక్టీరియాల్ని గుర్తించారట. దాంతో వాటిల్లోని ఎంజైమ్‌లను ప్రయోగశాలలో తయారుచేసే ఆలోచనలో ఉన్నారు పరిశోధకులు.

తండ్రి కొడుకుతో కోపంగా..కొత్తిమీర తీసుకొని రమ్మంటే పుదీనా తీసుకొని వచ్చావు కదరా..నీకు కొత్తిమీరకు పుదీనాకూ తేడా తెలియదా..? తాడిచెట్టులా పెరిగితే సరిపోయిందా వెళ్లు..వెళ్లు..ఇల్లు వదిలి వెళ్లిపో తెలుస్తుంది జీవితం అంటే ఎంటో..?

కొడుకు: సరే నాన్న పద ఇద్దరమూ ఇల్లు వదిలి వెళదాం పద..

తండ్రి: ఎందుకు నేనెందుకు?

కొడుకు: అమ్మ చెప్పింది ఇది మెంతికూర అంటా..!!

...

భార్య: ఏమండీ ఓసారి మీరు స్పీచిచ్చినపుడు..జనాలు టమాటాల్తో కొట్టారు కదా! మళ్లీ ఓసారి స్పీచివ్వండి..టమాటా చారు చేసుకుందాం.

భర్త: సర్లే నీతోపాటు మనవీధులోని మహిళలందరినీ పిలువు. వారూ ఏరుకుంటారు.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com







# రాళ్లకు ప్రాణం









అందమైన రామచిలుక, ముద్దొచ్చే కుక్కా, పిల్లి, గుడ్లగూబ, ఏనుగు, పెద్దపులి ఈ బుల్లి జీవులన్నీ చూసీ చూడగానే ముద్దొచ్చేస్తున్నాయి కదూ. కానీ ఇవన్నీ నిజమైన జంతువులు కావు. ఓ కళాకారుడి సృష్టి. ఇటలీకి చెందిన ఆర్టిస్టు రాబర్టో రిజో పనికిరాని చిన్నచిన్న రాళ్లను తన కళతో ఇలా ప్రాణమున్న జీవుల్లా మలుస్తున్నాడు. రకరకాల రాళ్లతో సేకరించే అలవాటున్న రిజోకు జంతువులన్నా ఎంతో ప్రేమ. అందుకే ఆ రెండు ఇష్టాల్ని ఒకటిగా చేసి 'స్టోన్ ఆర్ట్' పేరుతో వీటిని తయారుచేస్తున్నాడు. రాయి ఆకారాన్ని బట్టి రంగులు వేసి ఆయా జీవుల రూపాన్ని తెప్పిస్తున్నాడు. వీటిని చూస్తుంటే నిజమైన జంతువుల్లా కనిపిస్తున్నాయి కదూ! ఆసక్తి ఉంటే మీరూ ప్రయత్నించండి..











# 'సంఘీ' భావం



## కృత్రిమ మేధతో మనుగడకు ముప్పు

**శాస్త్ర** సాంకేతికత గణనీయమైన అభివృద్ధిని సాధిస్తోంది. అనూహ్యమైన మార్పులతో పరిజ్ఞానం అందుబాటులోకి వస్తోంది. అయితే ఏమార్పు అయినా మానవుడి అదుపులో ఉన్నంతవరకు ఇబ్బంది ఉండదు. స్థాయి మించిపోతే మానవ మనుగడకే ముప్పు వాటిల్లుతుంది. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో ఎదురు కానున్నాయని భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. కంప్యూటర్‌లో ఏ ప్రోగ్రాం అప్‌లోడ్ చేస్తే ఆమేరకు మాత్రమే పనిచేస్తుంది. దీనితో కంప్యూటర్లు పూర్తిగా మన అదుపులో ఉంటాయి. అయితే కృత్రిమ మేధ దీనికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. దీనికి ఆలోచించే మేధస్సు కలిగి ఉంటుంది. సమస్యలను అదే పరిష్కరించుకుంటుంది. ఏ ప్రశ్న అడిగినా, సమస్య గురించి చెప్పినా క్షణాల్లో పరిష్కారం తెలుపుతుంది. జ్ఞాపకాలను గుర్తుంచుకోవడం, నెమరువేయడం, తార్కిక - గణన శక్తి, పలు భాషలను అర్థం చేసుకోవడం వంటి సామర్థ్యాలను కలిగి ఉంటుంది. అంటే ఒకరకంగా ప్రతిసృష్టి అనుకోవచ్చు. అంతవరకు బాగానే ఉంది. కాని మన పరిధి దాటి కృత్రిమ మేధ వ్యవహరించే అవకాశాలు లేకపోలేదు. అలాంటి పరిస్థితి ఎదురైతే ఎదుర్కోవడం మానవుల వల్ల కాదని పలువురు శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సైన్స్, ఇంజనీరింగ్‌ల కలయికతో రూపు దిద్దుకుంటున్న తెలివైన యంత్రం కృత్రిమ మేధగా విశ్లేషిస్తున్నారు. కృత్రిమ మేధ మనకు ఉపయోగపడేంత వరకు ఎలాంటి ముప్పు ఉండదు. పరిస్థితి విషమిస్తే దాని ప్రభావం మానవాళిపై తీవ్రస్థాయిలో ఉంటుంది. తాజాగా కొందరు బాలీవుడ్ నటులు పాకిస్థాన్‌లో సంచరించినట్లు కృత్రిమ మేధను ఉపయోగించి చేసిన వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ అయ్యాయి. దీనితో ప్రస్తుతం బాలీవుడ్‌లో ప్రముఖ నటులు ఈ విషయంపై ఉద్యమం చేసేందుకు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం సిసి కెమెరాలు కేవలం చిత్రాలను మాత్రమే తీసి మనకు అందిస్తాయి. అయితే కృత్రిమ మేధలో సిసి కెమెరాలు నేరస్తులను గుర్తు పట్టి పోలీసులకు సమాచారం అందిస్తాయి. అంతే కాకుండా అతను ఏయే నేరాలు చేశాడు. ఏయే ప్రాంతాల్లో పర్యటించాడన్న వివరాలు కూడా పూర్తిస్థాయిలో పోలీసులకు అందిస్తాయి. అంతవరకు మంచిదే. దీనిని దుర్వినియోగ పరిచి పోలీసులు, సైనికుల కదలికలకు ఉపయోగిస్తే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మరోపక్క పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఈ వ్యవస్థ చాలా త్వరగా అమలులోకి వస్తుంది. అప్పుడు లక్షల సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోవలసి వస్తుంది. వంద మంది చేసే పనిని ఒక కృత్రిమ మేధ కొన్ని గంటల్లోనే పూర్తి చేస్తుంది. ఇప్పటికే కొన్ని మీడియా సంస్థలు కృత్రిమ మేధతో రూపకల్పన చేసిన యాంకర్లను పనిలోకి దింపారు. ఈ యాంకర్లు ఏ భాషనైనా స్పష్టంగా పలకడం, కళ్ల ముందు కనిపిస్తున్న విజువల్స్‌ను అర్థం చేసుకుని ఆమేరకు యాంకరింగ్ చేయడం వంటివి చేస్తున్నాయి. దీనితో మీడియా రంగంలో పనిచేస్తున్న వేలాది మంది యాంకర్లు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితులు నెలకొంటున్నాయి. మరోపక్క ఎంతటి పరిజ్ఞానం ఉన్నప్పటికీ వీటి ముందు సరిపోయే అవకాశం లేదు కాబట్టి మేధావంతులు కూడా సమాజంలో వెనుకబడిపోతారు. దీని పర్యావసానం అధిక ప్రభావాన్ని చూపుతుంది. ఒకరకంగా చెప్పాలంటే ఇంతవరకు యంత్రాలను ఉపయోగించుకున్న మనం ఇకపై క్రమంగా యంత్రాలు చెప్పినట్లు నడుచుకోవాల్సిన పరిస్థితి ఎదురౌతుంది. సరిగ్గా చెప్పాలంటే రోబో సినిమాలో రజనీకాంత్ తయారు చేసిన చిట్టి రోబోను ఒక ప్రతికూల భావాలు కలిగిన వ్యక్తి తనకు అనుకూలంగా ప్రోగ్రామింగ్ చేసి విధ్వంసానికి ఉపయోగిస్తాడు. చివరకు ఆ రోబోయే అతని ప్రాణాలు తీసుకుంటుంది. అలాంటి పరిస్థితి కృత్రిమ మేధ వల్ల కలిగే ప్రమాదం ఉంది. ప్రస్తుతం తాజాగా డ్రైవర్ లేకుండా నడిచే కార్లను రూపకల్పన చేస్తున్నారు. ఒకవేళ ఈ కారు ప్రమాదానికి గురైతే ఎవరిని బాధ్యులు చేయాలి. కారు కొన్న యజమాని, ఉత్పత్తిదారు, ఇంజనీరులలో ఎవరు బాధ్యత వహిస్తారు. దీనితో న్యాయపరమైన సమస్యలు కూడా ఉత్పన్నమౌతాయి. ప్రపంచ వ్యాప్తంగా దేశాలు భద్రత కోసం లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నాయి. సైనికులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశం కోసం పోరాడుతున్నారు. ప్రాణనష్టం సమస్యను పరిష్కరించేందుకు అమెరికా, రష్యా, ఇజ్రాయేల్, యునైటెడ్ కింగ్‌డమ్, చైనా, దక్షిణ కొరియా వంటి అభివృద్ధి చెందిన దేశాలు కృత్రిమ మేధను రంగంలో దింపేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే డ్రోన్‌లను ఉపయోగించడం ద్వారా శత్రువుల కదలికలను గుర్తిస్తున్నారు. ఇక కృత్రిమ మేధ అమలుచేస్తే ఈ డ్రోన్ వాటికవే నిర్ణయాలు తీసుకుని కాల్పులు జరిపే మేధస్సును కలిగి ఉంటాయి. ఎలాన్‌మస్క్ వంటి వాణిజ్యవేత్తలు మానవ మెదడులో ఒక చిప్‌ను జొప్పించడం ద్వారా అతనికి ఉన్న మేధా శక్తిని పదింతలు అధికం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కృత్రిమ మేధ వల్ల ప్రయోజనాలు ఉన్నప్పటికీ వాటి వల్ల కలిగే ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలాంటి రోబోలు కంప్యూటర్‌లను హ్యాక్ చేయడం, ప్రభుత్వ పరిపాలనను అస్తవ్యస్తం చేయగలుగుతాయి. ఇప్పటికే కొన్ని ఇంజనీరింగ్ కళాశాలల్లో కృత్రిమ మేధ అంశాలను ప్రవేశపెట్టాయి. ఏదైనామన అదుపులో ఉన్నంత వరకు ముప్పు లేదు. మన పరిధి దాటితే వాటిని ఎదుర్కోవడానికి మానవాళికి కుదిరే పనికాదు. అందుకే కొందరు శాస్త్రవేత్తలు ఈ పరిజ్ఞానాన్ని అణుబాంబుతో పోలుస్తున్నారు. అణుబాంబు కంటే కృత్రిమే మేధ మరింత ప్రమాదకరమని మేధావులు భావిస్తున్నారు.

**- డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ**

# కాస్ట్‌లీ పెళ్లిళ్లు కష్టాల కావిళ్లు

కవర్ స్టోరీ

**డాక్టర్ నీలం సంపత్**



**మానవజాతి మనుగడలో, పురోగతిలో స్త్రీ, పురుషుల సంగమం అనివార్యమైన ప్రక్రియ అయితే అందుకు ఊపిరిలూదుతున్న వివాహవ్యవస్థ పాత్ర వెలకట్టలేనిదే. మనదేశ సాంప్రదాయ సామాజిక వ్యవస్థకు బలమైన పునాదిగా కొనసాగుతున్న వివాహవ్యవస్థ మొత్తం ప్రపంచానికే ఆదర్శంగా భావించక తప్పదు.**

వేదకాలం నుండి వర్తమానం వరకు మానవ నాగరికత మనుగడకు మూలాధారంగా కొనసాగుతున్న వివాహబంధం ఇరువురి మనుగడకు అవసరమైనప్పటికీ ఈ సంబంధం సృష్టికోసం, దాన్ని శాశ్వతం చేసుకోవడం కోసం, అడుగడుగునా స్త్రీ అణిగిమణిగి వుండాల్సి రావడమే కాదు, ఆమెతోపాటు ఆమె కుటుంబం కూడా సామాజిక చిన్నచూపుకు, ఆర్థిక దోపిడికి గురికావాల్సి వస్తున్నవైనం శోచనీయమే. నాటి నుండి నేటివరకూ వివిధ వైవాహిక సంబంధిత సాంప్రదాయాల నెపంతో వరుడి కోణంలో ఆలోచించినప్పుడు ఒక్క ఐడియా జీవితాన్నే మార్చేస్తుందన్నట్లు, ఓ వివాహం అతని, అతని కుటుంబానికి సంబందించిన సకల ఆర్థిక సమస్యల పరిష్కారానికి మార్గంగా మారుతోందనిపిస్తోంది. భారతదేశంలో వివాహవ్యవస్థ మూలాలలోకి వెళ్లి పరిశీలించినప్పుడు వివాహ సందర్భంగా వధువు తల్లిదండ్రులు తమ కూతురి మంచి కోరుతూ స్వచ్ఛందంగా తమ ఆర్థికశక్తి అనుమతించిన మేరకు కానుకలు ఇవ్వడం ఓ సాంప్రదాయంగా కొనసాగుతూ వస్తుంది. ఈ సాంప్రదాయమే ఆచరణలో ఓ భ్రష్టాచారంగా రూపుదాల్చి వధువు కుటుంబ ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా వరుడితోపాటు, ఆయన కుటుంబం తాలూకు గొంతెమ్మ కోరికలను తీర్చుకునే పైలట్ ప్రాజెక్టుగా మారి అత్తారింటిలో వధువుపై వరకట్న వేధింపులకు, గృహహింసకూ దారితీస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. వరకట్నం ఓ సామాజిక దురాచారంగా మారిన క్రమంలో ప్రభుత్వం అనివార్యంగా దానిని కూకటివేళ్లతో పెకిలించడానికి 1960వ సంవత్సరంలోనే వరకట్న నిషేధచట్టాన్ని జారీ చేసింది. ఈ చట్టం ప్రకారం వరకట్నం ఓ భ్రష్టాచారమే. సామాజిక నేరమే. అది తీసుకునే వారు చట్టరీత్యా నేరస్తులే కాదు శిక్షార్హులు కూడానని చెప్పక తప్పదు. ఈ సాంప్రదాయమే వరకట్న పిశాచిగా రూపాంతరం చెంది ఈదేశంలో మహిళలపై పెచ్చుమీరుతున్న అమానవీయ హింసకు సింహభాగం తానే కారణంగా మారుతున్న వైనాన్ని ఏఏటికాయేడు నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాలు తేల్చి చెప్తున్నాయి. ఇంత జరిగినా స్వతంత్ర భారతదేశంలో జారీ చేయబడిన అన్ని చట్టాలలోకెల్లా ఆచరణలో అమలుకు నోచుకోని అగ్రగామి చట్టంగా వరకట్న నిషేధచట్టం అపకీర్తిని మూటగట్టుకొని చేష్టలుడిగి చూస్తోంది.

## పెళ్లిళ్ల తంతులో కొత్త పోకడలు!

ఒకప్పుడు వివాహమహోత్సవ ఆహ్వాన శుభపత్రికలతో సాదర ఆహ్వానాన్ని అందుకోవడం ద్వారా ప్రారంభమయ్యే వివాహ వేడుకలు పూలు, పండ్లు వరపూజతో మొదలై లగ్నం, నాగవెల్లిల రూపంలో ఓవారం రోజులకు తగ్గకుండా వారివారి ఆర్థికశక్తి కొలది వధూవరుల కుటుంబాలు వారి బంధువులూ, హితులూ, స్నేహితులతో ఆనందంగా జరుపుకోబడేవి. వివాహవేడుకలలో భాగంగా వరుడు వధువు మెడలో వేసే మూడుముళ్లూ, ఆమెతో కలిసి నడిచే ఏడడుగులూ వారి మధ్య ఏడేడు జన్మల బంధాన్ని సృష్టించేశక్తిని కలిగి వుంటాయనే నమ్మకంతో వధూవరులకు సంబంధించిన కుటుంబాలు మతాలకతీతంగా వివాహ సంబంధిత ముహూర్తాలను సెకన్లతో సహా త్రికరణశుద్ధిగా పాటించేవారు.

సదరు ముహూర్తబలమోలేదా దాని మూలంగా ఆ జంటకు ఏర్పడిన అచంచల విశ్వాసమో కారణమేదైనా వారి వివాహానంతరం జీవితం నిండునూరేండ్లపాటు ఆనందంగా కొనసాగేది. ఈ క్రమంలో పచ్చని పందిరితోపాటు షడ్రసోపేతమైన తినుబండారాలను తయారు చేయడంలో కుటుంబ సభ్యులూ, బంధువులంతా మమేకమై పనిచేస్తూ అతిథులకు రుచికరమైన విందు భోజనాలతో పాటు సకల మర్యాదలు చేసేవారు.
వీటితోపాటు అత్తింటివారి అతిథి సత్కారాలే పెళ్లి తాలూకు చిరస్మరణీయమైన జ్ఞాపకాలుగా చిరస్థాయిగా వధూవరుల, వారి కుటుంబాల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేవి. మానవ సంబంధాల సామాజిక అల్లికతో ప్రతిపెళ్లితో ఏర్పడే కొత్త కుటుంబం ఆనందకరమైన జీవితాన్ని అనుభవించగలిగేది. కాని నేడు ఆ వివాహ వేడుకలో తొలిఘట్టమైన అత్యంత ఆకర్షణీయమైన వివాహమహోత్సవ ఆహ్వాన శుభపత్రికలు మెలమెల్లగా కనుమరుగౌతున్నాయి. వాట్సాప్ మెసేజ్‌ల రూపంలో డిజిటల్ వీడియోల రూపంలో వివాహముహూర్త విషయాన్ని ఆహూతులు అతిథులకు సెల్‌ఫోన్ల ద్వారా చేరవేస్తున్నారు. బంధుమిత్రుల ఇండ్లకు వెళ్లి సాంప్రదాయబద్ధంగా వారిని వివాహానికి ఆహ్వానించడం చాలావరకు తగ్గిందనే చెప్పక తప్పదు.

**మాయమైపోతున్న మానవ సంబంధాలు**

పచ్చని పందిరి, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల ఆత్మీయ సమ్మేళనంతో రుచికరమైన విందుభోజనాల తయారీతోపాటు కనీసం ఓ వారం రోజులకు తగ్గకుండా లగ్నం, నాగవెల్లిల సందడి తెరమరుగైపోతోంది. నేటి ఆధునిక ప్రపంచంలో పెళ్లిపేరుతో ఇరువురు వ్యక్తుల మధ్యేకాదు, రెండు కుటుంబాల మధ్య ఓ శాశ్వత సంబంధాన్ని సృష్టించబోయే వేడుక స్వభావమే మారుతోందనిపిస్తోంది.
ఈనాటి స్పీడుయుగంలో వివాహవేడుక కేవలం ఒక్కరోజే కొన్ని గంటల్లోనే ఏదో ఒక ఫంక్షన్ హాల్లో లేదా ఓ కన్వెన్షన్ సెంటర్లో కేటరింగ్ సదుపాయంతో ఇన్‌స్టంట్ భోజనాలతో అతిథులను సంతృప్తిపరిచి సాగనంపేస్థాయికి చేరుకున్నది. దీనికి మెరుగులు దిద్దడానికి ఈవెంట్ మేనేజ్‌మెంట్ గానాబజానా తోడై అతిథులను మైమరిపిస్తోంది. అన్ని ఖర్చులు తడిసి మోపెడై రెండు కుటుంబాలపై పెనుభారాన్ని మోపుతున్న వైనం గమనార్హం.
తులనాత్మకంగా పరిశీలించినప్పుడు వరకట్నం పెళ్లి ఖర్చులతో సహా అధిక భారాన్ని మోయాల్సి వస్తున్నది మాత్రం



నిస్సందేహంగా వధువు కుటుంబాలదే కావడం మనకు తెలిసిందే. తొలినాళ్లలో ఫొటోగ్రఫీ వచ్చిన తర్వాత మొత్తం పెళ్లితంతును బ్లాక్ అండ్ వైట్ ఫొటోల రూపంలో బంధించి ఆల్బమ్‌లుగా కూర్చి జీవితకాల పర్యంతం వివాహవేడుకల మధురస్మృతులను నెమరు వేసుకుంటూ సంతోషపడేవారు. ఆ తర్వాత కలర్‌ఫొటోలు, వీడియోల ప్రవేశంలో వివాహ వేడుకల్లో వాటి ప్రాధాన్యత పెరిగింది.
ఈనేపథ్యంలో ఈరోజు వివాహ వేడుక కార్యక్రమం తాలూకు ఫొటోగ్రఫీ మూడురకాలుగా వర్గీకరించబడింది. మొదటిది ప్రీ వెడ్డింగ్ షూట్, రెండవది మ్యారేజ్‌ఫొటో షూట్ కాగా ఈమధ్యకాలంలో పోస్ట్ వెడ్డింగ్ ఫొటోషూట్ రూపంలో మూడోరకం ఫొటోషూట్ కూడా పురుడు పోసుకుంటుంది.

**తెరమరుగైపోతున్న సాంప్రదాయాల ప్రాధాన్యత**

సాంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ అందమైన భవిష్యత్ వైవాహిక జీవితాన్ని కలగంటూ వివాహవేడుక తాలూకు తంతునంతా త్రికరణశుద్ధిగా పాటించే కుటుంబాలు కనుమరుగైపోతున్నాయి. మెహిందీ లేదా సంగీత్ పేరేదైనా పెళ్లికి ముందు జరిగే ఓ అద్భుతమైన కల్చరల్ ఫెస్టివల్. కాబోయే వధువరులతోపాటు వారి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులంతా మిరుమిట్లు గొలిపే వెలుగుల్లో చెవులు చిల్లులుపడే సంగీత వాయిద్యాల సవ్వడులతో ఉవ్వెత్తున ఎగసిపడే సముద్రకెరటల్లా మారి తమనుతాము మరిచిపోవడమే కాకుండా వివాహం కన్నా ముందు జరిగే అత్యంత ముఖ్యమైన సాంప్రదాయపు మూలాలను మైమరచి గంతులేసే ఓ ఆధునిక డాన్స్ ప్రక్రియ. ఈ ఈవెంట్ నిర్వహణ కోసం భారీ సెట్టింగ్‌ల ఏర్పాటుతో పాటు సదరు ఈవెంట్‌ను రికార్డు చేయడానికి వేలు, లక్షల రూపాయల వ్యయంతో అత్యంత ఆధునిక కెమెరాలతో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల పోటీపడతారు. నిజానికి వివాహవేడుకను ఆచారాలూ, సాంప్రదాయాలకు అనుగుణంగా చేసే వెసులుబాటును కలిగించడం లేదంటూ ఇటీవల ఓ పూజారి రోదనతో కూడిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయిన వైనాన్ని బట్టి పెళ్లితంతును ఓ మొక్కుబడిగా పాటిస్తూ ముందుకు



సాగుతున్నారనిపిస్తోంది. ఈ క్రమంలో వివాహం ఆచరణలో ఓ రొటీన్ ఎంటర్‌టైన్‌మెంట్ ఈవెంట్‌గా మారుతున్నవైనం ఆందోళన కలిగిస్తోంది. సంగీతవిభావరితో కూడిన సదరు ఈవెంట్ నిర్వహణ కోసం ఈవెంట్ నిర్వాహకులకు లక్షల రూపాయలను చెల్లిస్తున్నారు. ఇక ఆర్థికంగా బాగా ఉన్నవాళ్లు, సెలబ్రిటీలు, సినిమావాళ్ల విషయానికి వచ్చినప్పుడు ఆధునిక పెళ్లిళ్ల విధానాల కోసం కోట్లాదిరూపాయలను ఖర్చులకు పెడుతున్నారు. ఇటీవలే విడాకులు తీసుకుని ఓ సినీసెలబ్రిటీ జంట వివాహఖర్చు ఏభైకోట్ల రూపాయలకు మించి జరిగిందనే వాస్తవం బహిరంగ రహస్యమే.

## ప్రి వెడ్డింగ్ ఫొటోషూట్ ఉద్దేశమేమిటి?

గతంలో సమీపబంధు మిత్రుల ద్వారా లేదా మన కుటుంబంతో ఎంతో సన్నిహిత సంబంధాలు కలిగిన పెళ్లిళ్ల పేరయ్యల ద్వారా పెళ్లి సంబంధాలు కుదిరేవి. అంటే పరోక్షంగా ఎంతో కొంత పరిచయమున్న కుటుంబాల మధ్యే పెళ్లి సంబంధాలు కుదిరే సాంప్రదాయమున్న నేపథ్యంలో కాబోయే వధూవరులు కలివిడిగానే ఉండేవారు. నేటి వివాహవ్యవస్థలో 99శాతం పెళ్లిళ్లు మ్యారేజ్‌బ్యూరోలు, షాదీ డాట్ కామ్‌ల ద్వారానే కుదురుతున్న నేపథ్యంలో ఏమాత్రం కుటుంబ పరిచయం లేకుండా సుదూర ప్రాంతాలలో నివసిస్తున్న యువతీయువకులే భార్యాభర్తలుగా మారబోతున్న నేపథ్యంలో వారిమధ్య బెరుకుని తొలగించి వివాహవేడుకకు ముందే ఒకరికొకరిని దగ్గర చేసే ఉద్దేశంతో వివాహానికి ఓ పదిరోజుల ముందే ఈ ప్రీవెడ్డింగ్ ఫొటో షూట్ కార్యక్రమాన్ని నిర్వహించడం నేటి సాంప్రదాయంగా మారిందనే వాదన వున్నప్పటికీ అంకనాన్నా ముందు డేటింగ్ చేసినవారికిదెలా వర్తిస్తుందో బోధపడడం లేదు. నిజానికి తొలిదశలో సినిమావాళ్లు, సెలబ్రిటీలు, సంపన్న వర్గాలకు చెందిన కుటుంబాల మధ్యే ఇది ప్రారంభమైంది. కోట్ల రూపాయలున్న ధనవంతులు దేశంలోనే కాదు ప్రపంచంలోనే అత్యంత ఆకర్షణీయమైన లొకేషన్లలో ప్రీవెడ్డింగ్ ఫొటోషూట్‌కు వెళ్లడం పట్ల ఎవరికీ అభ్యంతరం లేదు. కాని ప్రదర్శన ప్రభావంతో ఈ సాంప్రదాయం నేడు మధ్య, దిగువమధ్య తరగతులకు చెందిన కుటుంబాలకు చేరువై వారికి ఆర్థిక వనరుల వెసులుబాటు లేకున్నా తమ పిల్లల ఒత్తిళ్లతోనో లేదా సమాజంలో గొప్పల కోసమో ఈ సంస్కృతిని గౌరవిస్తూ ఫొటోషూట్‌కు అనివార్యంగా వెళ్లేలా చేయడమే ప్రమాదకరంగా మారుతోంది.



## ఫొటోషూట్‌తో ఒరిగేదేమిటి?

ప్రీ వెడ్డింగ్‌షూట్‌లో ప్రధానంగా వధూవరులుగా మారబోయే యువతీయువకులు వారివారి అభిరుచులకు అనుగుణంగా వారికి ఇష్టమైన లొకేషన్లలో ఫొటోలకు, వీడియోలకు ఫోజులిస్తూ ఓ ఊహాజనిత సినిమాలో హీరో, హీరోయిన్లుగా మారిపోతారు. మెజారిటీ సందర్భాల్లో వధువు తల్లిదండ్రులే ఈ ఫొటో, వీడియోగ్రఫీకి నిర్మాతలుగా మారి బడ్జెట్‌ని సమకూర్చాల్సి వస్తుంది. వివాహ సంబంధిత పెట్టుబోతలు, వరకట్న సమర్పనకన్నా ముందే వధువుల కుటుంబాలపై కనీసం ఓ లక్షా రెండు లక్షల రూపాయల వ్యయాన్ని మోపుతోంది. దీనికి అదనంగా మధ్యతరగతి, దిగువమధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువతీయువకులకు వారికి అందనంత దూరంలో ఉన్న లగ్జరీలైఫ్ రుచి చూపిస్తుంది. ఫలితంగా కష్టపడే స్వభావానికి దూరమై సుందరస్వప్నంలాంటి ఈ ప్రీ వెడ్డింగ్ ఫొటోలు, వీడియోలు నిజం కానప్పుడు వాటిని నిజం చేసుకోవడం కోసం వధువు, ఆమె తల్లిదండ్రులపై వేధింపులు ప్రారంభమయ్యే అవకాశాలు లేకపోలేదనే భావన సర్వత్రా వెల్లువెత్తుతోంది. అయినప్పటికీ తమ కలలు నిజం కాకపోతే నేరస్తులుగా మారి రాత్రికి రాత్రే ఏదో తప్పుడుపనితో డబ్బులు సంపాదించుకుని లగ్జరీగా లైఫ్‌ని గడపడానికి ప్రయత్నం చేసే ప్రమాదముందనే మనోవిజ్ఞానవేత్తల అభిప్రాయాన్ని కొట్టిపారేయడానికి వీల్లేదు.

## వెకిలితనాన్ని పెంచిపోషిస్తున్న ఫొటోషూట్!

సోషల్ మీడియాలో వైరలవుతున్న వివిధ ప్రి వెడ్డింగ్ ఫొటో షూట్‌ల వివరాల లోతుల్లోకెళ్లినప్పుడు అందులో పాలుపంచుకుంటున్న యువతీ, యువకుల విపరీత ప్రవర్తన విస్తుగొలుపుతోంది. దుర్గంధభూయిష్టమైన మురికి కాలువల్లో ముద్దులాడుతూ ఒక జంట, సమాధుల మధ్య అప్పుడే తవ్విన బొందలో పడుకొని చిద్విలాసంగా ఫోజులిస్తూ మరొక జంట, పాములూ, మొసళ్లతో పరాచికాలాడే బిల్డప్‌తో మరో జంట, ఒకరు సిగరెట్టు పొగ పీల్చి మరొకరి నోట్లోకి పంపిస్తూ మైమరచే ఇంకో జంట, అశ్లీలం సైతం సిగ్గు పడే హావ భావాలతో బహిరంగ ప్రదర్శన చేసే మరో జంట బయట పత్రికలూ, ప్రసార సాధనాలలోకి వచ్చినవి ఈ కొన్నయితే, అలా రాకుండా ప్రి వెడ్డింగ్ ఫొటో షూట్ పేరుతో ఎన్ని అసహ్యమైన, అభ్యంతరకరమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయో ఊహిస్తేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే కాలంలో అవి కూడా సోషల్ మీడియా ద్వారా వైరల్ అయితే ఆధునిక నాగరికత పేరుతో కొనసాగుతున్న ఈ అనాగరిక చర్యల ద్వారా నాగరిక సమాజానికి జరగబోయే నష్టాన్ని అంచనా వేయడం కూడా కష్టమనే బుద్ధిజీవుల అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు. వెనుకటికో సినీ కవి అన్నట్లు “ఆర్థికంగా అన్నీ వున్నవాడి ఇంట్లో చావు కూడా పెళ్లిలాగా జరుపుకోవడంలో ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ రెక్కాడితేగానీ డొక్కాడని దిగువ మధ్య తరగతి కుటుంబాలతో పాటు, అల్పాదాయ వర్గాలు దిన దిన గండం నూరేండ్ల ఆయుష్షుగా బతికేవారు ప్రి వెడ్డింగ్ ఫొటో షూట్ భ్రమలో పడి సంస్కృతికి దూరమైతే పెళ్లి తర్వాత వాస్తవిక జీవితం నల్లేరుపై నడకలాగా సాగకపోవచ్చు”. ఈ యదార్థాన్ని జీర్ణించుకోవడం కష్టమే.

అయితే వర్తమాన సమాజంలో ఫొటోగ్రఫీపై ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తున్న వ్యక్తులకు ఈ కార్యక్రమం ఉపాధిని కల్పిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేకపోయినప్పటికీ మెజారిటీ ప్రజలను వాస్తవిక ప్రపంచం నుండి కన్ను తెరిస్తే కరిగిపోయే కలల లాంటి భ్రమలతో కూడిన అవాస్తవిక ప్రపంచంలోకి తీసుకెళ్తుందని చెప్పక తప్పదు. అందుకే నేటి సమాజంలో ప్రతి తల్లీదండ్రి మెజారిటీ వయస్సు వచ్చిన తమ పిల్లలను వైవాహిక జీవితం వైపు తరలించే క్రమంలో తమ శక్తియుక్తులను సద్వినియోగం చేసుకుంటూ తిరుగులేని ఉత్పత్తి శక్తులుగా మారి నూతనంగా ఏర్పడబోయే తమ కుటుంబాలతో పాటు తమ కన్నవాళ్లను సైతం కంటికి రెప్పలా కాపాడుకుంటూ, తమ కుటుంబాలకు ఆర్థికంగా వెనుదన్నుగా మారే విధంగా తీర్చిదిద్దాలి. అంతేకానీ పరాన్న జీవులుగా మారి భోగలాలసతతో కూడిన జీవితాన్ని అనుభవించడానికి ఉత్ప్రేరకాలుగా మారుతున్న ప్రి వెడ్డింగ్ ఫొటో షూట్ లాంటి పనికిమాలిన సాంప్రదాయాన్ని పెంచి పోషించరాదు. అన్నీ వున్నవారు ఆకాశంలో ఫొటో షూట్ చేసుకోవడం పట్ల ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ దిగువ మధ్య తరగతి, అల్పాదాయ వర్గాలు ఎడారిలో ఎండమావి లాంటి ఇలాంటి సాంప్రదాయాలకు దూరంగా వుండడమే మంచిది. లేని పక్షంలో వారి కుటుంబాలు వరకట్న



భారంతో పాటు అదనంగా ఇలాంటి అనుత్పాదక ఖర్చుల భారంతో సతమతమౌతూ ఊహాజనితమైన మాయాలోకంలోకి నెట్టివేయబడి తమ దైనందిన జీవనాన్ని సాఫీగా కొనసాగించడానికి అవసరమైన ఆర్థిక వనరులను సంపాదించుకోవడానికి కనీస ప్రయత్నం చేయకుండా తమను తాము కథానాయకులు, నాయికలుగా భావిస్తూ కాలం వెళ్లబుచ్చే ప్రమాదం లేకపోలేదు.

**ఊపందుకుంటున్న పోస్ట్ వెడ్డింగ్ ఫొటో షూట్**

నూతన వధూవరులు, వారి కుటుంబాలే కాదు, వారి దగ్గర బంధువులూ వివాహ వేడుకల్లో తడిసి ముద్దయిన తర్వాత ఆ మధుర జ్ఞాపకాల ఒడిలో ఓలలాడుతూ నూతన దంపతులు హాయిగా, ఆనందంగా హనీమూన్ ట్రిప్‌కి వెళ్లే ముందు– వారు పరస్పరం ఒకరికొకరు పరిచయమైనప్పటి నుండి వివాహం జరిగేంతవరకు వారు పొందిన మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వాటిని షోకేస్ చేసుకునే క్రమంలో పోస్ట్ వెడ్డింగ్ ఫొటో షూట్ పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతుండడం గమనార్హం. పెళ్లిలో సాంప్రదాయ డ్రెస్‌లకూ, ఫిక్సెడ్ లొకేషన్‌కూ, ట్రెడిషనల్ ఫొటోగ్రఫీకి భిన్నంగా ప్రకృతి ఒడిలో భిన్నమైన లొకేషన్‌లలో ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్లతో రకరకాల కాస్ట్యూమ్‌లతో కలిసిన మనసులతో ఎలాంటి బెరుకు లేకుండా తమ మనస్సుకు నచ్చిన ఫోజులతో ఫొటోలు, వీడియోలు తీయించుకొని జీవిత కాలం పాటు గుర్తుంచుకునే విధంగా ఆల్బమ్‌లను తూరు చేసుకోవడానికి ఈ ఫొటో షూట్ దోహదం చేస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు. కాకపోతే వివాహ మహోత్సవ వేడుక బడ్జెట్‌పై ఈ ఫొటో షూట్ అదనపు భారాన్ని మోపుతున్న వైనాన్ని గమనించినప్పుడు ఆర్థికంగా వున్నవాళ్లకే ఇబ్బంది లేకపోవచ్చు. కానీ పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు ప్రదర్శన ప్రభావంతో మధ్య తరగతి, దిగువ మధ్య తరగతులకు చెందిన కుటుంబాలు సామాజిక ఒత్తిడితో ఈ ఫొటో షూట్‌ని అనివార్యంగా ఆదరించాల్సి రావడం సదరు కుటుంబాలకు పెనుభారంగా మారుతున్నది.



**హనీమూన్ కల్చర్‌కి తెరదీస్తున్న నేటి తరం!**

గతంలో వివాహమైన తర్వాత నూతన దంపతులకు ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో సైతం వారి ఆంతరంగికతకు ఎలాంటి అవరోధాలు కలగకుండా అరమరికలూ లేని దాంపత్య జీవనాన్ని కొనసాగించడానికి అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేవారు. దానికితోడు వారి నూతన దాంపత్య జీవనం ఫలప్రదం కావడానికి అవసరమైన చిట్కాలను తల్లిదండ్రులే కాదు, సంసార జీవనంలో తల పండిన అమ్మమ్మలూ, నానమ్మలూ, తాతయ్యలూ అందించేవారు. వారి కనుసన్నల్లోనే నూతన వధూవరుల సంసారం జీవనం ఎంతో ఆనందంగా కొనసాగేది. కానీ నేడు కాలం మారింది. వివాహానంతరం నూతన దంపతులు కుటుంబాలకు అనంత దూరంలో వీలైతే దేశంలోని అరకు, ఊటీ, కొడైకెనాల్, గోవా, సిమ్లా, మనాలి లాంటి ప్రదేశాలకే కాదు ఇంకా వారి ఆర్థిక పరిస్థితులు అనుమతిస్తే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విహార కేంద్రాలతో విలసిల్లుతున్న మాల్దీవులు, సియాచెల్, సింగపూర్, పారిస్, స్విట్జర్లాండ్, థాయిలాండ్ లాంటి హనీమూన్ సెలబ్రేషన్ కోసం అనువైన దేశాలలో ఏకాంతంలో విహరించడానికి రెక్కలు కట్టుకుని ఎగిరిపోతున్నారు.

ఆకర్షణీయమైన ప్యాకేజీలతో అనేక టూరిస్టు సంస్థలు ముందుకొస్తున్నాయి. లక్షల రూపాయల ఖర్చులతో తమకు అత్యంత ఇష్టమైన ప్రదేశాల్లో నూతన దాంపత్య జీవనాన్ని ప్రారంభించినవారూ వుంటున్నారు. ప్రపంచంలోనే అత్యంత అద్భుతమైన ప్రదేశంలో ఎవ్వరూ చెదరగొట్టలేని ఏకాంతంలో నూతన దాంపత్య జీవనాన్ని ప్రారంభించినా పరస్పర విశ్వాసంతో నిండు నూరేండ్ల వైవాహిక జీవితాన్ని అనుభవించలేక ఆరు నెలలు తిరగక ముందే విడాకులకై న్యాయ పోరాటం చేస్తున్న జంటలు ఉన్నాయి.

**ఏం జరగాల్సి వుంది?**

ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన నాగరికతగా గుర్తించబడిన ఈజిప్ట్‌లోని మెసపొటేమియా నాగరికత తర్వాత అంతే ప్రాచీన నాగరికతగా పేరు గాంచిన హరప్పా, మొహంజోదారో, సింధూ నాగరికతలే పునాదులుగా అనాదిగా ప్రపంచంలోనే అత్యంత సుస్థిరమైన, ఎంతో పవిత్రమైన వివాహ వ్యవస్థగా భారతీయ వివాహ వ్యవస్థ పేరు గాంచిన వైనం గర్వకారణం. అందుకే ఇప్పుడు ప్రపంచ దేశాలన్నీ భారతీయ వివాహాల వైపు ఆకర్షితులౌతున్నాయని అంగీకరించక తప్పదు. ఈ నేపథ్యంలో ప్రాచ్య, పాశ్చాత్య నాగరికతల ముసుగులో భారతీయ వివాహ వేడుక తాలూకు ఆచారాలను, సాంప్రదాయాలను నిర్లక్ష్యం చేస్తున్న వైనాన్ని త్రికరణ శుద్ధిగా విడనాడాల్సిందే. ఆధునికత పేరుతో తరతరాలుగా బలమైన భార్యాభర్తల బంధానికి శాశ్వత చిరునామాగా కొనసాగుతూ వస్తున్న మన వివాహ వేడుక తాలూకు ప్రతి కట్టుబాటునూ త్రికరణ శుద్ధిగా పాటిస్తూ ముందుకు సాగాల్సిందే. వాట్సాప్ సందేశాలు, డిజిటల్ ఆహ్వాన పత్రికలు వద్దని కానే కాదు. మానవ సంబంధాలను బలహీనపరచకూడదనే ఆవేదనను అర్థం చేసుకోవాలి. మెహిందీ, సంగీత్, ప్రి వెడ్డింగ్, వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ ఫొటో షూట్‌లు, వీడియోలు అసలే వద్దని చెప్పే హక్కు ఎవరికీ లేదు. తమకు ఎంతో ఇష్టమైన ప్రదేశాల్లో హనీమూన్‌తో నూతన దంపతులు తమ దాంపత్యానికి చిగురులు తొడుగుతామంటే కాదు కూడదనే వాదన కూడా ఎవ్వరూ చేయడం లేదు. కాకపోతే వేల సంవత్సరాలుగా భిన్న కుటుంబాలకు చెందిన స్త్రీ పురుషులను భార్యాభర్తలుగా మార్చి వివాహం తాలూకు ఆచారాలూ, సాంప్రదాయాలతో మాత్రమే కాదు, అద్భుతమైన సామాజిక కట్టుబాట్లతో వారికి నిండు నూరేండ్ల వైవాహిక జీవితాన్ని కానుకగా అందిస్తున్న భారతీయ వివాహ వ్యవస్థ మూలాలను గౌరవిస్తూ, వాటికి ఆధునిక సాంకేతికతను జత చేస్తూ ప్రపంచ వేదికపై భారతీయ వివాహ వ్యవస్థ ఔన్నత్యాన్ని వెలుగులీనేలా చేయాలనే మన సమాజం కలగంటోంది. ఈ దేశ ప్రజలు రాబోయే కాలంలో ఈ సమాజపు కలను ఏ మేరకు నెరవేరుస్తారో కాలమే తేల్చి చెప్పాలి.



**భూతల స్వర్గాన్ని తలపిస్తున్న పెళ్లి మండపాలు**

పాల పొరకతో వేసిన పచ్చని పందిళ్లతో, అరటాకుల స్తంభాలతో, మామిడాకుల తోరణాలతో, బంతిపూల దండలతో అతి తక్కువ ఖర్చుతో అత్యంత అందంగా వేసిన పెళ్లి మండపాలతో పాటు వాటికి అనుబంధంగా ఓ మోస్తరు రంగు రంగుల షామియానాల కిందనే వేసిన కుర్చీలతో ఒకప్పుడు మెజారిటీ పెళ్లిళ్లు ఇంటి ముందే జరిగేవి. పెళ్లికూతురు తల్లిదండ్రులు తమ ఇంటి ముందే వేసిన పెళ్లి పందిళ్ల కింద కాళ్లు కడిగి కన్యాదానం చేయడం ఎంతో పుణ్యంగా భావించేవారు. కానీ ఇప్పుడు కాలం మారింది. బాగా డబ్బులున్నవాళ్లు తమ డాబునీ, దర్పాన్నీ ప్రదర్శించుకోవాలనే తపనతో పెళ్లి మండపాలు వేసే వెబ్ సైట్‌లూ, ఈవెంట్ మేనేజర్లను సంప్రదించడం ద్వారా లక్షల రూపాయలను వెచ్చిస్తూ పెళ్లి మండపాలను ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానికంగా లభ్యం కాకపోతే అవసరమైతే విదేశాల నుండి పువ్వులను తెప్పించి మరీ డెకరేట్ చేస్తున్న వైనం బహిరంగ రహస్యమే. ఆర్థికంగా వున్నవాళ్లు ఆకాశమంత పందిరి, భూదేవంత గద్దెతో పెళ్లి మండలపాలను ఏర్పాట్లు చేసి తమ పిల్లల పెళ్లిళ్లు చేసుకుంటే ఈ సమాజానికి ఎలాంటి అభ్యంతరం ఉండదు. కాకపోతే ఇలాంటి భారీ బడ్జెట్‌తో నిర్వహిస్తున్న మండపాల పట్ల మధ్య తరగతులు, దిగువ మధ్య తరగతుల ప్రజలు ఆకర్షించబడితేనే ప్రమాదంగా పరిణమించే అవకాశముంది.

**క్యాటరింగ్ సదుపాయంతో కొత్త పుంతలు తొక్కుతున్న విందు భోజనాలు!**

పెళ్లి ఏర్పాట్లలో తలమునకలయ్యే కుటుంబాలు అతిథులూ, ఆహ్వానితులందరికీ సమయా భావంతో నాలుగు రకాల వంటలు చేసి పెట్టడానికి నానా తంటాలు పడాల్సిన అవసరమే లేని రోజులివి. వెజ్, నాన్ వెజ్ వంటకాలు మాత్రమే కాదు సౌత్ ఇండియన్, నార్త్ ఇండియన్, మొగలాయీ లాంటి అనేక వెరైటీలతో రకరకాల రుచులతో అతిథులను సంతృప్తి పరచడానికి నిష్ణాతులైన క్యాటరింగ్ ఏజెన్సీలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో పెళ్లి భోజనాలను సమకూర్చే పెద్దలు తమ స్టేటస్‌ని ప్రదర్శించుకోవాలనే ఉద్దేశంతో కనీసం తక్కువలో తక్కువ ఓ ఇరవై వెరైటీలతో గరిష్టంగా ఓ వందకు పైగా వివిధ వెరైటీలతో కూడిన ఆహార పదార్థాలను, స్వీట్‌లను, ఫ్రూట్స్‌నూ, డ్రైఫ్రూట్స్‌నూ, రకరకాల కూల్ డ్రింక్స్‌నూ, ఐస్ క్రీమ్‌లనూ మెనూలో చేరుస్తున్న నేపథ్యంలో వాటిలో కనీసం ఓ ఐదు పది శాతం ఆహార పదార్థాలను సైతం అతిథులు భుజించడం గగనంగా మారుతోంది. ఫలితంగా పరబ్రహ్మ స్వరూపమైన ఎంతో విలువైన ఆహార పదార్థాలన్నీ చెత్త కుండీల పాలౌతుండడం దురదృష్టకరం. ఈ ధోరణితో కుటుంబాలపై అనవసరపు ఆర్థిక భారం పడడంతో పాటు వేల మంది ఆకలి తీర్చే శక్తి కలిగిన ఆహార పదార్థాలు సమాజంలో ఆకలికి అలమటిస్తున్న అనేకమంది నిరుపేదల ఆకలి తీర్చలేక వృథాగా మట్టిలో కలిసిపోతున్న వైనం గుండెల్ని పిండేస్తోంది. పెళ్లిళ్లు ఎలా చేశారు అనేది కాదు ముఖ్యం, ఆ దంపతులు ఎంత అన్యోన్యంగా కలకాలం జీవించేందుకు అవసరమైన మానసిక సిద్ధపాటు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు నూతన వధూవరులకు తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలి. సర్దుబాటుతోనే ఏ కాపురాలు అయినా నిలబడతాయని దంపతులు గ్రహించిననాడే ఆనందంగా జీవించగలరు. ❑

# మార్కెట్లో కొత్తగా



## పర్ఫెక్ట్ వాషర్

**ఈ రోజుల్లో** కూరగాయలనైనా, పండ్లనైనా శాస్త్రానికి కడిగితే సరిపోదు. వాటి పెంపకానికి వాడిన కెమికల్స్, మార్కెట్లో అంటిన దుమ్ము, దూళీ కొట్టుకు పోయేంతగా కడగాలి. అందుకే అల్ట్రాసౌండ్ ఎలక్ట్రిక్ వాషర్ ఇంట్లో ఉండాలి. ఇది మలినాలను సమర్థవంతంగా పోగొడుతుంది. పోషకాలు, రుచి దెబ్బ తినకుండా ఈజీగా క్లీన్ చేస్తుంది. బ్యాటరీ ఆధారంగా పనిచేస్తుంది. కాబట్టి ఈ డివైజ్‌ను ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లొచ్చు. ఇందులో బియ్యం, కూరగాయలు, పండ్లతో పాటు నాన్‌వెజ్‌నూ శుభ్రం చేసుకోవచ్చు. షీ ఫుడ్, చికెన్, మటన్ వంటివి కడగటానికి సుమారు 12 నిమిషాల సమయం పడితే, కూరగాయలు, పండ్లకు 10 నిమిషాల చొప్పున టైమ్ తీసుకుంటుంది. ఈ డివైజ్‌లో హోల్స్‌తో కూడిన బౌల్ ఉంటుంది.

## ఫ్రోదర్ అండ్ స్టీమర్




**చాలామంది** నురగలు కక్కే కాఫీ, పాలను మాత్రమే ఇష్టపడుతుంటారు. అలాంటి వారికి ఈ మల్టీ ఫంక్షనల్ మిల్క్ ఫ్రోదర్ అండ్ స్టీమర్ భలే నచ్చేస్తుంది. ఇందులో నురగను వేడిగా లేదా చల్లగా తయారు చేసుకోవచ్చు. క్షణాల్లో కాఫీ పెట్టుకోవచ్చు. ఇది పని చేస్తున్నప్పుడు మెషిన్ శబ్దం ఇబ్బందిగా అనిపిస్తే ఆఫ్ చేసుకునే ఆప్షన్ కూడా ఉంది. కాబట్టి ఆఫీసుల్లోనూ వాడుకోవచ్చు. దీన్ని డైరెక్ట్‌గా వాటర్ ట్యాప్ కింద పెట్టేసి..క్లీన్ చేసుకోవచ్చు. అనంతరం మెత్తని క్లాత్‌తో పొడిపొడిగా తుడిచేస్తే సరిపోతుంది.



## పోర్టబుల్ క్యాంపింగ్ స్టవ్

'డివైజ్ హ్యాండీగా ఉండాలి..ఎక్కువమందికి వండిపెట్టాలి. ఎక్కడికి కావాలంటే అక్కడికి తీసుకెళ్లేందుకు సౌకర్యంగా ఉండాలి' ప్రస్తుతం కుక్‌వేర్స్ విషయంలో క్యాంపింగ్ లవర్స్ డిమాండ్స్ ఇవి. నేచర్‌హైక్ డబుల్ బ్యూటేన్ గ్యాస్‌స్టవ్..పైడిమాండ్స్ అన్నిటికీ తగ్గది. దీన్ని విడదీసుకుని.. రెండు స్టవ్స్ మీద సులభంగా వంట చేసుకోవచ్చు. బౌల్, పాన్‌లాంటివి వాడుకుని చాలా వెరైటీలను కుక్ చేసుకోవచ్చు. కోల్డ్ రోల్డ్ షీట్, స్టెయిలెస్ స్టీల్, ఐరన్ వంటి మెటీరియల్స్‌తో రూపొందిన ఈ ఫోల్డింగ్ స్టవ్‌ని ఎక్కడికైనా కంఫర్టబుల్‌గా చేత్తో పట్టుకెళ్లొచ్చు. ఈ స్టవ్‌తో పాటు ఒక చిన్న మినీ గ్యాస్ సిలిండర్ పెట్టుకుంటే ప్రయాణం పర్ఫెక్ట్‌గా సాగుతుంది.

# పక్క చూపులు



కోర్కెల దీపం మెదడులో వెలుగుతుంటే
అటువైపుగా ఆలోచనల చుట్టరికం
పక్క చూపులతో పలకరింపుల సైగలు
స్నేహాలింగనం కోసం తహతహ
అందితే కలుపుగోలుగా కరచాలనంతో
షురూ.
పక్క చూపులంటే పక్కోళ్లపై కత్తులు
నూరడం కాదు
పక్కాగా మంచి మార్గం ఎంచుకోవడం
గుణపాఠాలు పాదాలకు కట్టి నడక
సాగించడం
శేషం లేకుండా లెక్కచేయడం.
పరీక్ష హాల్లో పక్క చూపుల పాము
సాయం కోసం చేతులు చాచడం
జవాబు కప్ప నోట కరుస్తుందో
ఎగ్జామినర్ కంటగింపవుతుందో చెప్పలేం
ఎవరి పనిలో వారు నిమగ్నమైతే
అవసరముండదు పక్క చూపుల గోల
పక్క చూపులు కొన్ని తీరుస్తాయి పని
అలసట
మరికొన్ని చెడగొడతాయి పనిని.
దర్వాజ తెరిస్తే పక్కచూపులెన్నో
పడ్తాయి మనపై
వాకిలి కాదు వాడకట్టంతా ఓ చూపు
తగలేస్తాం మనం
పక్క చూపుల ఆకర్షణ అంతే.
అవి రోడ్డుపై పడిన చెత్తను
తొలగిస్తే సంతోషమే.
చూపులకు భాష ఉన్నట్లే
పక్క చూపులకు రకరకాల
భాషలుంటాయి
అర్థం చేసుకున్న మనసులు
ఆనందాన్నో, ఆగ్రహాన్నో
పంచుతాయి.

**- కొమురవెల్లి అంజయ్య**

## ఈవారం కవిత్వం




ఉదయ భానుని బంగారు
ముంగురుల జలతారు వెలుగులు
ఉదయ గిరుల గవాక్షంలో
పసిడి వన్నెల కిరణాలై
ఆహ్వాన నివేదనలతో వేకువ
భళ్లున తెల్లారిపోతుంది.
మేల్కొన్న జగతిని సప్త వర్ణాల
కాల రథం/ పడమటి కొండల వైపు
ఎవ్వరినీ లెక్కచేయక
వడి వడిగా మోసుకుపోతుంది.
చీకటి వెలుగుల బతుకులు
ఉదయాస్తమానాల నడుమ
నరుని వేడుకల విలాసాల వేదనల
'జీవితం'
కనిపించని కాలానికి
నమ్ముకున్న నమ్మకానికి
కనిపించని మనిషిలోని మనసు
నివేదనలు నిజమై కలవరిస్తుందో లేదో
తెలియకుండానే చీకటి పడిపోతుంది.

**- పి.బక్కారెడ్డి**

## నిశ్శబ్ద గీతమై..

మౌన సంభాషణలెన్నో
మనసు పొరల్లో.
ప్రవహించే గీత నదులెన్నో
అంతరాంతరాళాల్లో
ఊపిరాడని అవస్థల్లోనూ
మైదానమంత కవిత్వం పుడుతుంది
మూసిన కిటికీలపై
మనసు భాషను అది చిలకరిస్తుంది
చుక్కల జెండాలను పట్టుకుని
చిగురు చిరునామాగా ఊతమౌతుంది
బువ్వలోని మట్టి పరిమళమౌతుంది
జీవితాన్ని వడగట్టిన కన్నీరవుతుంది
అర్థం చెప్పే ఆచరణవుతుంది
గాలికి ఆయువు పోసి
ఆకుపచ్చని పాటవుతుంది
వాస్తవమై గుండెల్లో స్థాపితమౌతుంది
జరామరణాలు జయించి
అజరామరమవుతుంది
నదీ హృదయమవుతుంది
అనుభవాల అగాథాలపై
ఆలోచనాలోచనమవుతుంది
జీవన చైతన్యదాయినిగా వికసిస్తుంది

**- డా॥ తిరునగరి శ్రీనివాస్**

పుస్తక సమీక్ష

## పిల్లల కథలలో 'ఆకాశంలో అల్లరి'



చెరుకుపల్లి అనసూయ, రాధాకృష్ణలకు ఈ కథల సంపుటి అంకితం చేసారు. డా॥పత్తిపాక మోహన్ ముందుమాట రాసారు. ఈ కథలన్నీ పిల్లల కోసం చెప్పినవే. ఒక మానసికశాస్త్ర నిపుణురాలు (రాసినట్లుగా) చెప్పినట్లుగా ఈ కథలుంటాయి. చాలా కథల్లో నీతి ప్రధానంగాను బాలలకు జీవనరీతుల్ని పరిచయం చేస్తుంది రచయిత్రి. ఇద్దరు బాలికల మనస్తత్వ చిత్రణను అద్భుతంగా చెప్పిన కథ 'మంజూ బొమ్మల సంచి'.

పక్కింటి మంగ, తన బొమ్మలు తీసుకోవడం ఇష్టంలేని మంజూకు ఒకరోజు మంగ తన ఇంటికి తీసుకెళ్లి తన బొమ్మలతో ఆడిస్తుంది. పొరుగూరికి వెళ్లిన మంజు తల్లి కొంత ఆలస్యంగా ఇల్లు చేరడం మంగ మంజు కలిసి ఆటలు ఆడుకోవడం చూసి ఊపిరి పీల్చుకొంటుంది. పొరుగువారితో స్నేహంగా ఉండాలని చెప్పే కథ. ఎంత నీరు పోసినా నిండని 'బావి'ని చూసిన పిల్లలతో గణపతి 'మాస్టారి పాఠం' కథ ద్వారా పిల్లల్లో మానవ మెదడులోని శక్తి సముద్రం వలె అనంతమైనది. ఎంత నేర్చుకున్నా గ్రహించుకోగలశక్తి మీ మెదడుకి ఉంటుంది. విద్య అనంతమైనది. సముద్రంలోని ఉప్పునీరు తాగడానికి ఎలా పనికిరాదో, విద్యలేని తెలివి వృథా' అని పిల్లల్లో గణపతి మాష్టారు చదువుపై ఆసక్తి కల్గించే కథే ఇది. రాకుమారి సంయుక్త ఐరా ఉదయవర్మ పాలన గోళీ రాక్షసుడు రాజుగారి రోగం వైద్యుడికి వైద్యం కథలు చాలా బాగున్నాయి. బాలమిత్ర, చందమామ కథల్లాగే అనిపిస్తాయి. బాలలకు వినోదం విజ్ఞానం చైతన్యం కలిగించే యీ పిల్లల కథలు ప్రతి ఇంటా ఉండాల్సినవే.

**(ఆకాశంలో అల్లరి, రచన: డా॥హారిక చెరుకుపల్లి, వెల: రూ 100, ప్రతులకు: ఎల్ఐజీ-129, రామచంద్రాపురం, హైదరాబాద్)**

**- తంగిరాల చక్రవర్తి**

## ఏదో చెప్పాలని 'కౌలూరి' కవితా సంపుటి

కవిత్వాన్ని, జీవితంలో వృత్తిధర్మాన్ని సమన్వయపరిచి మానవతా విలువలతో, సామాజిక భావుకత ప్రదర్శించగల కవి కౌలూరి ప్రసాదరావు, 'ఏదో చెప్పాలని' అనుకొన్నా, ఎంతో ఎత్తున అత్యుత్తమ కవితా సంపుటిని ఆవిష్కరింపచేసారు. ఇందులోని యాభై కవితలలో ఒకటి అరా మినహాయించి బస్‌లో రాయడం అరుదైన విశేషం.




మంచినీళ్ల సీసా మూతపడి పోవడాన్ని 'మూతమన ప్రాణం! సీసామన దేహం' అంటూ తాత్వికంగా చెప్పగల లోతైన భావవ్యక్తీకరణ కౌలూరిని ప్రతిభావంతుడైన వచనకవిగా గుర్తింప చేస్తోంది. కప్పులు కడిగే వీధిబాలలు, మందులులేని వృద్ధయాచకులు, అన్నార్తులు, అనాధల జీవితాలలో వెలుగునింపడానికి, జబ్బులకి వెచ్చించే సొమ్ముతో సాయం అందించమని 'చేసి చూడు' కవితా సందేశం, వ్యధార్తుల కన్నీళ్ల తుడిచే ప్రయోజనాత్మకం. సహ(జ) జీవనం కవితలో 'నన్నంటి పెట్టుకొని ఉన్న కాగితాలు నా కట్టెతోపాటే అంటుకోనీ' అంటూ హృదయాలు స్పృశిస్తారు. 'ఒకరు మేశా' వర్తమాన రాజకీయ వైఖరులకు అద్దం పడ్తోంది. 'మహాభినిష్క్రమణం'లో మనిషి స్వార్థాన్ని 'నీకెపుడూ పరగడుపే, ఉదరంలో బ్లాక్‌హోల్ దాచావు' అంటూ అందుకే మూలాలున్న అరణ్యప్రస్థానాన్ని ప్రస్తావిస్తారు. కౌలూరి కవితలుగా అక్షరీకరించిన అద్భుత కవి.

**(ఏదో చెప్పాలని, కౌలూరి ప్రసాదరావు, వెల: రూ 125, ప్రతులకు: కె.ప్రసాదరావు, వేళ్లచింతలగూడెం (పోస్ట్), గోపాలపురం (మం), పశ్చిమగోదావరి జిల్లా)**

**- యర్రమిల్లి**

## వందశాతం వచన కవిత్వం

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా, శాఖాధ్యక్షుడిగా పనిచేసి రిటైర్డ్ అయిన ప్రొ॥ననుమాసస్వామి పలు గ్రంథాలు రాసారు. ధారావాహికలు, వృత్తిపురాణాలు, పలు పరిశోధనా పత్రాలు వెలువరించి అంతర్జాతీయ ఖ్యాతి పొందారు. పలు అవార్డులు పొందారు. ఈమధ్యే తెలంగాణ ప్రభుత్వం వారి భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 'తెలంగాణ బోనాలు' అన్న విశిష్ట పరిశోధన గ్రంథం వెలువరించారు. సమగ్రత, సంపూర్ణత, లోతైన శోధన స్వామి ప్రత్యేకతలు. 'ప్రవహిస్తున్న జైలుగానం' స్వామి 1969



తొలితెలంగాణ ఉద్యమం నాటి చారిత్రకాంశాలు, వారి జైలు జీవితం తల్లిదండ్రులు, భార్య, సునామి జలప్రళయం, అది సృష్టించిన' విధ్వంసం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం (2014) తద్వారా ఆశలు, ఆడియాసలు అన్నింటినీ తన వచన కవిత్వపు వస్తువులుగా చేసుకున్నారు. ధిక్కారస్వరంతో వివరించబడిన 30 విషయాలు పాఠకులకు కన్నులకు కట్టినట్లు వర్ణించారు.

ఉద్యమంలో పాల్గొనే కార్యకర్తల గురించి పోరాటం తమ జీవితలక్ష్యం కాకున్నా, సెంటిమెంట్ వశీకరణమంత్రంలా అకస్మాత్తుగా లాగేసి గోదాలో దించుతుందట (పే1).

వరంగల్ జిల్లా కేంద్ర కారాగారం బ్యారెక్కుల నడిమి జువ్విచెట్టు..రాజకీయ బోధివృక్షమైందట (పే3). ననుమాసకొలనులో తేలే తామరాకుపై బిందువుల్లా..దశాబ్దంపాటు అంటీఅంటనట్లుగా రచయిత, తనతండ్రి గడిపారట (పే 15). సెంటిమెంట్ ధిక్కారస్వరం ఈ రెండూ పుష్కలంగా ఉన్న ఈ కవి 'జైలుగానం'లోని వస్తువు ఎంపిక, వివరణ రెండూ ఆకట్టుకుంటాయి.

**(ప్రవహిస్తున్న జైలుగానం, రచన: ప్రొ.ననుమాస స్వామి, వెల: రూ 150, ప్రచురణ: ఉదయశ్రీ పబ్లికేషన్స్ సికింద్రాబాద్)**

**- కూర చిదంబరం**

## ఉచితంగా వైరస్ కట్టడి!




# వీటితో మరింత సులభం

కంప్యూటర్‌కు వైరస్‌లు పెద్ద పీడకలలు. ఆపరేటింగ్ సిస్టమ్‌ను దెబ్బతీయటం దగ్గరి నుంచి పీసీ సామర్థ్యాన్ని తగ్గించటం వరకూ రకరకాల ఇబ్బందులు సృష్టిస్తాయి. ఫైళ్లు, డేటా కూడా పోతాయి. గోప్యతకు భంగం వాటిల్లుతుంది. ఇక్కడే యాంటీవైరస్‌లు ఆదుకుంటాయి. ఇవి సమర్థమైనవే అయినా ధర ఎక్కువ. అదృష్టం కొద్దీ కొన్ని ఉచిత మార్గాలతో పీసీని వైరస్ రహితం చేసుకోవచ్చు.

### విండోస్ డిఫెండర్ సాయం

విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ గలవారికిది మంచి ప్రత్యామ్నాయం. ఇది బిల్టిన్‌గానే ఉంటుంది. అజ్ఞాత మార్గాల నుంచి మాల్వేర్‌లు, వైరస్‌లు పీసీ మీద దాడి చేయకుండా అడ్డుకుంటుంది. దీన్ని ఎనేబుల్ చేసుకోవటమూ తేలికే. స్టార్ట్ బటన్‌ను నొక్కి, బాక్సులో 'విండోస్ సెక్యూరిటీ' అని టైప్ చేయాలి. పాపప్ అయ్యే యాప్ మీద క్లిక్ చేయాలి. ఇందులో 'వైరస్ అండ్ థ్రెట్ ప్రొటెక్షన్' ఆప్షన్ ఉంటుంది. దీని మీద క్లిక్ చేసి, సెటింగ్సులోకి వెళ్లి 'మేనేజ్ సెటింగ్స్' మీద నొక్కాలి. ఇందులో 'రియల్-టైమ్ ప్రొటెక్షన్' ఆప్షన్‌ను ఆన్ చేసుకోవాలి. అడ్మినిస్ట్రేటర్ పాస్‌వర్డ్‌ను ఎంటర్ చేయటం లేదా ఇతర మార్గాలతో కన్‌ఫర్మ్ చేసుకుంటే చాలు. విండోస్ డిఫెండర్ యాక్టివ్ అవుతుంది. తరచూ పీసీని స్కాన్ చేస్తూ హానికర ముప్పుల గురించి హెచ్చరించి, తొలగిస్తుంది.

### వైరస్ నేపథ్యప్రక్రియల కట్టడి

వైరస్‌లు తరచూ ప్రాసెస్‌ల రూపంలో అజ్ఞాతంగా పని చేస్తుంటాయి. ఇవి జలగ మాదిరిగా పీసీ వనరులను పీల్చేస్తుంటాయి. వ్యక్తిగత వివరాల్లోకి తొంగి చూస్తుంటాయి. డేటానూ దొంగలిస్తుంటాయి. ఇలాంటి అవాంఛిత బ్యాక్‌గ్రౌండ్ ప్రోగ్రామ్స్ బెడద తొలగించుకోవటానికి, కంప్యూటర్‌ను వైరస్‌ల బారి నుంచి కాపాడుకోవటానికి తేలికైన మార్గముంది. స్టార్ట్ బటన్‌ను నొక్కి, సెర్చ్ బాక్సులో 'టాస్క్ మేనేజర్ అని టైప్ చేసి, ఎంటర్ చేయాలి. అప్పుడు విండోస్ టాస్క్‌మేనేజర్ యాప్ ఓపెన్ అవుతుంది. ఇందులో ప్రాసెసెస్ లేదా డిటెయిల్స్ విభాగంలో అనుమానిత ప్రాసెస్‌లను వెతకాలి. వాటిని ఎంచుకొని 'ఎండ్‌టాస్క్' మీద క్లిక్ చేయాలి.

**అజ్ఞాత స్టార్టప్ ప్రోగ్రామ్స్ డిసేబుల్**

పీసీని ఆన్ చేసిన ప్రతిసారీ తెర దిగువన కుడివైపున పాపప్ అయ్యే చిన్న ఐకాన్లు చికాకు కలిగిస్తాయి. ఇవి హానికరమైనవి కావని అనిపించినప్పటికీ రహస్యంగా డేటాను దొంగిలిస్తాయి. బ్రౌజింగ్ హిస్టరీ మీద నిఘా వేస్తాయి. కంప్యూటర్ స్టార్టప్ వేగాన్ని నెమ్మదింపజేస్తాయి. అందువల్ల అంత ముఖ్యం కాని స్టార్టప్ ప్రోగ్రామ్స్‌ను డిసేబుల్ చేసుకోవడం మంచిది. ఇందుకోసం కీబోర్డు మీద కంట్రోల్, ఆల్ట్, డిలీట్ బటన్లు అన్నింటినీ కలిపి నొక్కాలి. మెనూలోంచి టాస్క్ మేనేజర్‌ను ఎంచుకోవాలి. స్టార్టప్ విభాగం మీద క్లిక్ చేస్తే బోలెడన్ని పేర్లు, ఐకాన్లు కనిపిస్తాయి. ఇవన్నీ సిస్టమ్‌ను బూట్ చేసినప్పుడు తమకు తామే లాంచ్ అయ్యే ప్రోగ్రామ్‌లే. ఏదైనా అనుమానాస్పదంగా కనిపిస్తే దాని మీద రైట్ క్లిక్ చేసి 'డిజేబుల్' మీద నొక్కాలి. దీంతో దాని పని అక్కడితో ఆగిపోతుంది. ఇలాగే మిగతా అనుమానాస్పద ప్రాసెస్‌లను డిసేబుల్ చేసుకోవాలి. అనంతరం టాస్క్ మేనేజర్‌ను క్లోజ్ చేసి, పీసీని రీస్టార్ట్ చేయాలి. ఆ వెంటనే స్టార్టప్ ప్రాసెస్ వేగం పెరగటం, సాఫీగా సాగటం గమనించొచ్చు.

### తాత్కాలిక ఫైళ్ల తొలగింపు

కంప్యూటర్ మీద పనిచేస్తున్నప్పుడు వివిధ ప్రోగ్రామ్‌లు, యాప్‌లు తాత్కాలిక ఫైళ్లను సృష్టించుకుంటాయి. ఇవి కొంత సమాచారాన్ని దాచుకుంటాయి. దీని అవసరమేమీ ఉండదు. కొన్నిసార్లు ఇలాంటి తాత్కాలిక ఫైళ్ల వెనక హానికర సాఫ్ట్‌వేర్



దాగి ఉండొచ్చు. వీటిని డిలీట్ చేసుకుంటే ముప్పులనూ తగ్గించుకోవచ్చు. స్టార్ట్ బటన్‌ను నొక్కి, 'డిస్క్‌క్లీనప్' కోసం వెతకాలి. ఇది ఓపెన్ అయ్యాక శుభ్రం చేసుకోవాల్సిన డ్రైవ్‌ను ఎంచుకొని 'ఓకే' మీద క్లిక్ చేయాలి. వివిధ రకాల ఫైళ్లను తొలగించాక ఎంత స్పేస్ మిగులుతుందో ఇది సూచిస్తుంది. రీసైకిల్ బిన్, డౌన్‌లోడ్స్, థంబ్‌నెయిల్స్..ఇలా ఆయా బాక్సుల్లో టిక్ పెట్టుకోవాలి. 'ఓకే' బటన్ మీద క్లిక్ చేసి,

కన్‌ఫర్మ్ చేసుకుంటే తాత్కాలిక ఫైళ్లు పోతాయి. ఒకవేళ విండోస్ అప్‌డేట్ లేదా ప్రీవియస్ ఇన్‌స్టలేషన్ వంటి మరిన్ని ఫైళ్లను డిలీట్ చేసుకోవాలనుకుంటే 'క్లీనప్ సిస్టమ్ ఫైల్స్' ఆప్షన్‌నూ ఎంచుకోవచ్చు. ప్రాసెస్ ముగిసేంతవరకు డిస్క్ క్లీనప్ యాప్‌ను క్లోజ్ చేయొద్దు. తర్వాత పీసీని రీస్టార్ట్ చేస్తే సరి. తాత్కాలిక ఫైళ్లతో పాటు వైరస్‌ల బెడద తొలగిపోతుంది.



## జంక్ మెయిళ్లకు కళ్లెమిలా..

**టెంప్ మెయిల్:** ఇది తాత్కాలిక ఈ మెయిల్ చిరునామాను అందిస్తుంది. ఉచిత వర్షన్ ఖాతాల వంటి వాటి నమోదుకు వాడుకోవచ్చు. దీంతో ఈమెయిల్ పంపలేం గానీ బర్నర్ ఖాతా ప్రయోజనాలు పొందొచ్చు. ఈమెయిళ్లు రెండు గంటల వరకు స్టోర్ అవుతాయి. అనంతరం వాటంతటవే డిలీట్ అవుతాయి. బ్రౌజర్ ద్వారా లోనికి వెళ్లి బర్నర్ ఈమెయిల్ సేవలు పొందొచ్చు. అప్పుడు ఒకేసారి 10 చిరునామాలు పొందొచ్చు. ఇన్‌బాక్స్‌లు పూర్తిస్థాయిలో వాడుకోవచ్చు. స్టోరేజీనీ పెంచుకోవచ్చు.

## ఈమెయిల్‌వన్‌డెక్



కేవలం రెండంచెలతోనే ఈమెయిల్‌వన్‌డెక్‌ను సెటప్ చేసుకోవచ్చు. మనుషులమేనని ధ్రువీకరించుకొని, బర్నర్ ఈమెయిల్ చిరునామాను పొందితే సరి. ఇది ఉచితమే. మెసేజ్‌ను కంపోజ్ చేయొచ్చు. అవతలివారి నుంచి సమాధానమూ అందుకోవచ్చు. వచ్చే మెసేజ్‌లు రోజులో చాలాసేపటి వరకు స్టోర్ అవుతాయి. ఈమెయిల్‌వన్‌డెక్ తరచూ మెయిల్ లాగ్స్‌ను తొలగించేస్తుంది. ఇలా ముఖ్యమైన సందేశం కోసం ఎదురుచూస్తున్నప్పుడు మేలు చేస్తుంది. బిట్‌కాయిన్, ఎథిరమ్ క్రిప్టోకరెన్సీల రూపంలో ప్రీమియం సేవలకు అప్‌డేట్ చేసుకునే సదుపాయమూ ఉంది. దీంతో అజ్ఞాత ఈమెయిళ్లు పంపొచ్చు. ఇష్టమైన విధంగా ఈమెయిల్ ఐడీలను సృష్టించుకోవటం, ఈమెయిల్ అడ్రస్‌లను సేవ్ చేసుకోవటం వంటివన్నీ చేయొచ్చు.

## గెరిల్లా మెయిల్

ఇది మన బ్రౌజర్‌లోనే ఉచిత డిస్పోజబుల్ ఈమెయిల్‌కు అవకాశం కల్పిస్తుంది. ఐడీని ఎంచుకొని, మెసేజ్ కంపోజ్ చేయటమే తరువాయి. ఈమెయిల్‌కు అందే ధ్రువీకరణ లింక్‌ను క్లిక్ చేసి, తర్వాత డిలీట్ చేసేయొచ్చు. స్పామ్ మెయిళ్లు మన ఇన్‌బాక్స్‌లోకి చేరకుండా గెరిల్లా మెయిల్ వాటిని ముందు తొలిగించేస్తుంది. అందిన మెయిల్ చెక్ చేసేంతవరకు ఇది క్వారంటైన్‌లో అలాగే ఉంటుంది. గంట తర్వాత క్వారంటైన్, ఇన్‌బాక్స్ నుంచి మెయిళ్లు అదృశ్యమవుతాయి.



## 10మినిట్‌మెయిల్

ఉచిత వ్యక్తిగత ఈమెయిల్ చిరునామాకు ఇది చక్కటి సాధనం. ఈమెయిళ్లు పంపటానికి దీన్ని వాడుకోవచ్చు. పేరుకు తగ్గట్టుగానే ఇది 10 నిమిషాల్లోనే ఈమెయిల్‌ను, అడ్రస్‌ను డిలీట్ చేసేస్తుంది. ఏదైనా ఖాతాకు ఈమెయిల్ చిరునామాను ధ్రువీకరించుకోవాల్సి వస్తే దీన్ని వాడుకోవచ్చు. హెచ్‌టిటిపిఎస్,10మినిట్‌మెయిల్. కామ్‌లోకి ఇన్‌బాక్సులోకి వెళ్లి, లింక్‌ను క్లిక్ చేస్తే సరి. కావాలనుకుంటే ఆ మెయిల్‌కు సమాధానమూ పంపొచ్చు. ఏదైనా ముఖ్యమైన మెయిల్ అయితే దాన్ని వేరే ఈమెయిల్ అడ్రస్‌కు ఫార్వర్డ్ చేయొచ్చు కూడా. ఒకవేళ సమయంలోపు ఈమెయిల్ అందకపోతే 'గివ్ మీ 10 మోర్ మినట్స్' బటన్‌ను క్లిక్‌చేస్తే కౌంట్‌డౌన్ టైమర్ రీసెట్ అవుతుంది. 10మినట్‌మెయిల్. కామ్‌లోకి వెళ్లి తాత్కాలిక ఈమెయిల్ పొందొచ్చు. దీనికి వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సిన అవసరమూ లేదు.



## యాపిల్ హైడ్ మై ఈమెయిల్

యాపిల్ పరికరాలు వాడేవారికి హైడ్ మై ఈమెయిల్ ఫీచర్ ఎంతో ఉపయుక్తం. ఇది ప్రత్యేక రాండమ్ ఈమెయిల్ చిరునామాలను సృష్టించి, ఇన్‌బాక్స్‌లోకి ఫార్వర్డ్ చేస్తుంది. ఎన్ని ఐడీలు అవసరమైతే అన్నింటినీ ఏర్పాటు చేసుకోవచ్చు. మెసేజ్‌లకు జవాబు ఇవ్వచ్చు. ఐక్లౌడ్‌కు సైన్‌ఇన్ అయితే చాలు. దీని ద్వారా ఈమెయిల్‌ను క్రియేట్ చేసుకోవటానికి సెట్టింగ్స్‌లోకి వెళ్లి, యాపిల్ ఐడీ మీద నొక్కాలి. ఐక్లౌడ్‌లోకి వెళ్లి, హైడ్ మై ఈమెయిల్ ద్వారా క్రియేట్ న్యూ అడ్రస్‌ను ఎంచుకోవాలి. తెర మీద కనిపించే సూచనల ప్రకారం కొత్త ఈమెయిల్ ఐడీని సృష్టించుకోవచ్చు.





కథ

# జీవో రక్షతి రక్షితః

పూర్వం రాయపురం అనే గ్రామానికి చేరువలో కొండకు దిగువన దట్టమైన అడవి వుండేది. అందులో చాలా పురాతనమైన మల్లన్న గుడి ఒకటి వుండేది. ఏడాదికొకసారి అక్కడ ఉత్సవాలు జరిగేవి. ఆ ఉత్సవాలకు వేలసంఖ్యలో జనం వెళ్లేవారు. సింహాలు, పులులు లాంటి క్రూర మృగాలు, తేళ్లు, పాములు లాంటి విషజంతువులు ఉన్నప్పటికీ ఎవరికీ ఎటువం టి కీడు జరిగేదికాదు. అదంతా దైవమహిమగా అందరూ భావించేవారు.

కాలం గడిచింది. వేటగాళ్లు పెరిగారు, చర్మంకోసం, మాంసంకోసం జంతువులను విచ్చలవిడిగా వేటాడసాగారు. వంట చెరుకుకోసం, గృహనిర్మాణాల కోసం లంచాలిచ్చి రాజోద్యోగుల నుంచి అనుమతి పొంది, పొందిందానికి పదింతలు చెట్లను నరకడం ప్రారంభించారు. ఇలా కొంతకాలం గడిచింది. అడవి చాలా వరకు పలచబడి పోయింది. జంతుజాతి చాలావరకు నశించిపోయింది. తరువాత జరిగిన తిరునాళ్లలో ఒకరిని పులి పొదల్లోకి ఈడ్చుకెళ్లింది. రాత్రుళ్లు అక్కడ నిద్ర చేసేవారిని తేళ్లు కుట్టాయని, పాములు కరిచాయని చాలామంది దేవస్థానం అధికారితో తమ గోడు వెళ్లపోసుకోవడం జరిగింది. చివరకు ఇది రాజుగారి చెవిన చేరింది. ఇన్ని వందల ఏళ్లుగా లేనిది ఇప్పుడెందుకు ఇలా జరుగుతున్నది? దైవమహిమ ఏమైంది? అంటూ రాజుకు సందేహం కలిగింది. ఆయన స్వయంగా అడవిలో ఆలయానికి పరివారంతో బయలుదేరి వెళ్లాడు. ఆయన చిన్ననాట నుండి మల్లన్నకి భక్తుడు. తాను రాజుగా పట్టాభిషిక్తుడు కాకముందు అడవిలోవున్న ఆలయానికి తల్లిదండ్రులతో చాలాసార్లు వెళ్లివున్నాడు, ఎప్పుడూ ఇలాంటి వార్తలు వినలేదు. రాజయ్యాక పనులవత్తిడితో ఇటీవల రావడానికి కుదరలేదు. ఇప్పుడు గుడికి వచ్చి చూస్తే అప్పటి అడవిలో ఇప్పుడు సగం కూడా లేదు. పచ్చదనంతో హాయి కలిగించే ఆ అడవి ఇప్పుడు వెచ్చగా వుండి చెమటలు పట్టిస్తున్నది. రాజుకు బాధ కలిగింది. నరసింహస్వామి దర్శనం అయ్యాక రాతిమంటపంలో పరివారంతో సహా సేదదీరుతూ, పక్కనే వున్న ఆశ్రమంలో వున్న సదానంద స్వామిని దర్శించుకుని 'స్వామీ! నాకు ఒక సందేహం. ఎన్నో వందల ఏళ్లుగా స్వామి దర్శనానికి వచ్చినవారికి కీటకాలవల్లకానీ క్రూరమృగాల వల్లకానీ ఎటువంటి కీడు జరిగినట్టు వినలేదు. తరతరాలుగా స్వామి వారి మహత్యాన్ని వింటూ వస్తున్నాం. కానీ ఇదేమిటి ఇప్పుడు వినరాని వార్తలు వింటున్నాం. కలికాల మహత్యం అనుకోవాలా?' అన్నాడు. దానికి సదానందస్వామి 'ప్రతిదానికీ కలికాలం అంటారు కానీ అది నిజం కాదు. మానవుడి మనస్తత్వంలో వచ్చిన మార్పు అన్నింటికి కారణం. తానొక్కడే సుఖపడాలి. ఇతర ప్రాణులన్నీ ఏమయిపోయినా పర్వాలేదు, అనే దుర్బుద్ధితో మానవుడు ప్రవర్తిస్తున్నాడు. సాధుస్వభావంతో, సకలప్రాణుల పట్ల ప్రేమతో అతడు వున్నప్పుడు, కొండకు వచ్చిన మానవులకు అవేమీ అపకారం చేయలేదు. ఎప్పుడు స్వార్థంతో అడవిని ధ్వంసం చేయడం, పశుపక్ష్యాదులను వేటాడి సంహరించడం మొదలుపెట్టాడో అప్పుడే అవి 'యథ్భావం తథ్భవతి' అని పెద్దలన్నట్లుగా మానవుని శత్రువుగా చూడడం ప్రారంభించాయి అంతే!' అన్నాడు. రాజుకు జ్ఞానోదయం అయింది. 'అన్ని ప్రాణులను ప్రేమించటమే దైవాన్ని ప్రేమించటం, అప్పుడే దేవుడూ మానవుని కాపాడుతాడు. అది మానవుడు మరిచిపోయాడు. మానవుడు ప్రకృతిలోని అన్ని ప్రాణుల్ని అంతం చేస్తూ వుంటే అవి మానవుడి పట్ల అలానే ప్రవర్తిస్తాయి. అన్ని ప్రాణులూ దేవుని బిడ్డలే గనక ఆయన కూడా తప్పు చేస్తున్న మానవున ఎల్లకాలం మన్నించలేడు కదా. వృక్షాలు, జంతువులూ క్షేమంగా వున్నప్పుడే మానవుడూ సుఖంగా వుండగలడు. పర్యావరణానికి హానికలిగితే మానవునికి హాని కలుగుతుంది తప్పదు'. ఇలా రాజు ఆలోచనలతో తిరిగి రాజధానికి రాగానే అడవుల నరికివేత, వన్య మృగాల వేట నిషేధించాడు. తరువాత కాలంలో మళ్లీ ఎప్పుడూ వన్యప్రాణుల వల్ల భక్తులకు ఎలాంటి ఇబ్బందీ కలిగినట్లు వార్తలు అందలేదు.

**-డా॥గంగిశెట్టి శివకుమార్**





## బాలగేయం

### సోడాలు



సోడాలండీ సోడాలు
రంగురంగుల సోడాలు
దాహం తీర్చే సోడాలు
రుచికరమైన సోడాలు
నిమ్మకాయతో తాగండి
నిమ్మళంగా ఉండండి
చల్లచల్లగా తాగండి
ఆరోగ్యంగా ఉండండి
గరీబు అయినా
షరాబు అయినా
సోడా తాగక మానరుగా
సోడాలండీ సోడాలు
దాహం తీర్చే
దివ్యపానీయాలు
మళ్లీ మళ్లీ
తాగాలనిపించే
మధుర పానీయాలు

**- అళహరి కాత్యాయిని**



## హలో ఫ్రెండ్...


**చిన్నారుల ప్రశ్నలకు**

వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.లలిత,** కాకినాడ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. వాతావరణ మార్పుల వల్ల ఎలాంటి నష్టాలుంటాయి?



**జవాబు: లలిత!** అనేక నష్టాలున్నాయి. వాతావరణ మార్పులను ప్రభావితం చేసే అంశాలను గురించి తెలుసుకుందాం. ఈ అంశాలలో ఒకటైన సముద్ర మట్టాల పెరుగుదలకు మళ్లీ ప్రధానంగా రెండు అంశాలు దోహదం చేస్తాయి. ఉష్ణభూతం వల్ల నీరు విస్తరిస్తుండటం ఒక కారణమైతే, మంచు ద్రవిస్తుండటం మరొక కారణం. వాతావరణ మార్పు వల్లనే మహాచక్రవాతాలు లేదా పెను తుపాన్‌లు(హారికేన్స్) వస్తున్నాయి. వాతావరణంలోని ఉష్ణోగ్రతను కొలిచినంత తేలికగా హారికేన్ పౌనఃపున్యతను, సాంద్రతను గణించలేం. గత ముప్పై సంవత్సరాలుగా అట్లాంటిక్ మహాసముద్రంలో సంభవిస్తున్న తుపాన్‌ల సంఖ్య రెట్టింపు అయ్యాయి. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయనీ, దీంతో పెనుతుపాన్‌లను చవిచూస్తున్నామని శాస్త్రవేత్తలు అంటున్నారు.

**- ఎన్.మోహిత్,** ఆదిలాబాద్

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'రష్‌మోర్' పర్వత శిఖరం దేనికి ప్రసిద్ధి చెందింది?

**జవాబు: మొహిత్!** అమెరికాలోని సౌత్ డకోటాకు చెందిన బ్లాక్‌హిల్స్‌లో ఉంది రష్‌మోర్ పర్వతం. ఈ ప్రాంతం అద్భుతమైన శిల్పకళకు ఈ ప్రాంతం పెట్టింది పేరు. నలుగురు అమెరికా అధ్యక్షులైన జార్జ్ వాషింగ్టన్, థామస్ జెఫర్‌సన్, అబ్రహం లింకన్, థియోడోర్ రూజ్‌వెల్ట్‌ల మొహాలను పోలి వుండేటట్టుగా ఇక్కడ పర్వత శిఖరాలను చెక్కారు.

# ఆట వస్తువులే మంచాలైతే..!

తల్లిదండ్రులకు పిల్లలే ప్రాణం. వారికోసం ఏమైనా చేసేందుకు వెనుకాడరు. పిల్లలకు సంబంధించి మార్కెట్లో ఏ కొత్తవస్తువు వచ్చినా వాటిని కొనేందుకు ఇష్టపడతారు.

అయితే ఈ తరం చిన్నారులు తమకు నచ్చిన వస్తువును ఆచితూచి మరీ తామే ఎంచుకుంటున్నారు. దానికి తోడు వాళ్లకంటూ విడిగా ఓ పడకగదీ ఉండటంతో తమకోసం ఓ బుల్లి ప్రపంచాన్నే సృష్టించుకుంటున్నారు. మరి ఆ రంగురంగుల ప్రపంచంలో ప్రతిదీ తమ ఒక్కరి దగ్గర మాత్రమే ఉండాలని పిల్లలు కోరుకోవడమూ సర్వసాధారణం కాబట్టి..వాళ్ల అభిరుచికి తగినట్లుగా బొమ్మల నుంచీ ఆ గదిని అలంకరించే ఇతర వస్తువుల వరకూ బోలెడు డిజైన్లలో మార్కెట్లో దొరుకుతున్నాయి. ఆ జాబితాలోనే ఈ 'బొమ్మల మంచాలు' తాజాగా వచ్చేసి పిల్లల్ని మెప్పిస్తున్నాయి. వాళ్ల ఇష్టంగా ఆడుకునే హెలికాప్టర్, లెగోలూ, స్టార్‌వార్స్, పైరేట్ షిప్, డైనోసార్ వంటి బొమ్మల్నే మంచాల రూపంలోనూ డిజైన్ చేస్తున్నారు తయారీదారులు.



### ఆటవస్తువులూ దాచుకునేలా..

చిన్నారులు మంచంపైన పడుకోవడం తోపాటూ అక్కడే కూర్చుని ఆడుకుంటారు. ఇక, దానిపైన నిల్చుని గెంతడం, దూకడం వంటివన్నీ మామూలే కాబట్టి వాళ్ల అవసరాలూ, ఆలోచనలూ, అభిరుచులూ దృష్టిలో పెట్టుకునే ఈ మంచాలను రూపొందించారు డిజైనర్లు. ఉదాహరణకు 'హెలికాప్టర్ బెడ్' అచ్చంగా హెలికాప్టర్‌లాగే ఉంటుంది. దానిపైన రోటర్‌బ్లేడ్లూ, ఎక్కి దిగేందుకు ఏర్పాటు, పడుకునేందుకు సరిపోయేలా చోటు, లైట్లూ అన్నీ ఉంటాయి. ఇందులోనే పుస్తకాలూ, బొమ్మలూ, ఇతర వస్తువుల్ని భద్రపరుచుకునేందుకు వీలుగా ప్రత్యేక అరలూ, హ్యాంగర్లు వంటివివీ ఉంటాయట. ఇక,చిన్నారులు ఎంతో ఇష్టంగా ఆడుకునే లెగో బ్లాకులతోనూ మంచాలను తయారు చేస్తున్నారు. కాస్త పెద్ద సైజులో ఉండే లెగో బ్లాక్స్‌నే రకరకాల రంగుల్లో తీసుకుని మంచాలుగా రూపొందిస్తార్న మాట. ఇవి సింగిల్ కాట్, బంక్‌బెడ్ రకాల్లోనూ ఉన్నాయి. వీటిపైనే ప్లే ఏరియా అదనం. స్టావ్‌వార్స్ పాత్రల్లో తమని ఊహించుకునే ఈతరం పిల్లల కోసం అబ్బురపరిచే డిజైన్లతో కనికట్టు చేస్తాయి 'స్టార్‌వార్స్ బెడ్స్'. ఈ మంచాలపైన కూర్చునే చిన్నారులు తాము నిజంగా స్టార్‌వార్స్ ప్రపంచం లో ఉన్నామా అనేంత సహజంగా ఉంటాయివి. అలాగే పేరేట్స్ కథల్ని ఇష్టంగా చదువుకునే పిల్లలకు 'పైరేట్‌షిప్' థీమ్ మంచాలు కూడా దొరుకుతున్నాయి. పెద్ద పడవలా కనిపించే ఈ బెడ్‌ను చెక్కతో తయారు చేసి అదనంగా తెరచాప వంటివీ అమర్చడంతో పైరేట్‌షిప్ మీద సముద్రంలో విహరిస్తున్న భావన కలగకమానదు. అలాగే జంతు ప్రేమికులైన చిన్నారుల కోసం ఓ పెద్ద డైనోసార్ నోరు తెరుచుకున్నట్లుగా కనిపించే 'డైనోసార్ బెడ్స్' కూడా ఉన్నాయి. వీటికి పెద్దపెద్ద పళ్లు ఉన్నా, అవి ఎంతో మెత్తగా స్పాంజిలా ఉంటాయి కాబట్టి పిల్లలకు గుచ్చుకుం టాయనే భయం లేకుండా నచ్చిన డిజైన్‌ను ఎంచుకోవచ్చు. అదే చిన్నసైజు కోటలా కనిపించే 'క్యాజిల్ బెడ్స్'కు అయితే ఓ వైపు మెట్లు, మరోవైపు జారుడుబల్లా ఉంటాయి. దాంతో తమకు నచ్చినట్లుగా ఈ కోటలోకి వెళ్లి, బయటకు రావొచ్చు అన్నమాట. పిల్లల పడకగదికే అందాన్ని తెస్తూ, ఒక అంతస్తుతో వస్తాయివి. కోరిన రంగుల్లో, సైజుల్లో దొరికేస్తూ, పిల్లలకు ప్లేజోన్‌గానూ ఉపయోగపడే ఈ మంచాల్ని కావాలనుకుంటే..కస్టమైజ్ కూడా చేసుకోవచ్చు. మరి మీ పిల్లలకు ఏ మంచం బాగుంటుందంటో సెలక్ట్ చేసుకోండి. ●



# వెరైటీ పచ్చళ్లు

## పచ్చి జామకాయల పచ్చడి



**కావలసిన పదార్థాలు**

పచ్చిజామకాయలు-4, పచ్చిమిరపకాయలు-6, చింతపండు పెద్ద ఉసిరికాయంత, ఉప్పు-తగినంత, పసుపు ఒక స్పూన్, నూనె-రెండు గరిటెలు, సెనగపప్పు - ఒక స్పూను, మినపప్పు-ఒక స్పూన్, ఆవాలు - ఒక స్పూన్, జీలకర్ర- ఒక స్పూన్, ఎండుమిరపకాయలు-5, ఇంగువ- ఒకస్పూన్, దూసిన కరివేపాకు-కొంత

**తయారీ విధానం**

జామకాయలు చిన్న ముక్కలుగా తరుగుకోవాలి. ముందుగా స్టౌ వెలిగించి, కళాయి పెట్టి, పోపు దినుసులన్నీ వేయించుకుని, అవి వేగాక దూసిన కరివేపాకు, ఆ పోపులో వేసి, అవి వేగాక ఎండుమిరపకాయ ముక్కలు కూడా వేసి వేయించి, పోపుని ఒక ప్లేటులోకి తీసుకుని, మరికాస్త నూనె కళాయిలో వేసి, అందులో జామకాయ ముక్కలు, పచ్చిమిరపకాయలు, చింతపండు, పసుపు, ఉప్పు, ఇంగువ వేసి మెత్తగా మగ్గనివ్వాలి. తర్వాత స్టౌ కట్టేసి, చల్లారిన పోపులో కొన్ని గింజలను, కరివేపాకు ఉంచి మిగతా పోపుని మిక్సీలో గ్రౌండ్ చేయాలి. అనంతరం మగ్గిన జామకాయ ముక్కలను కూడా వేసి గ్రైండర్‌లో వేసి పేస్టులా కాకుండా కాస్త బరకగా రుబ్బి, గిన్నెలోకి పచ్చడి తీసుకోవాలి. ఆ పచ్చడిలో పోపుగింజలు, కరివేపాకు, కొత్తిమీర తరుగు కలుపుకోవాలి. ఇష్టమైనవారు ఇంగువ బదులు వెల్లుల్లి కూడా వేసుకోవచ్చు. ఇది రోటీలలోకి, అన్నంలోకి చాలా బాగుంటుంది.

## పెసరపప్పు పచ్చడి

**కావలసిన పదార్థాలు:**

పెసరపప్పు-పావుకిలో

పచ్చడికి సరిపడా ఉప్పు, చిటికెడు పసుపు, చిన్న చెంచా ఇంగువ, పది ఎండుమిరపకాయలు.

**తయారు విధానం**

ముందుగా పెసరపప్పు ఒక్క గంట నీళ్లలో నానపెట్టుకోవాలి. గంట అయ్యాక పెసరపప్పును బాగా కడిగి, నీళ్లు వంచేయాలి. తర్వాత మిక్సీ జార్ తీసుకుని, అందులో పెసరపప్పు, ఉప్పు, పసుపు, ఇంగువ, ఎండుమిరపకాయలు వేసి మెత్తగా గ్రౌండ్ చేసుకోవాలి. నలిగేక ఒక గిన్నెలోకి తీసుకుని, నిమ్మరసం పిండుకోవాలి. ఈ పచ్చడి వేడివేడి అన్నంలో నెయ్యి వేసుకుని తింటే చాలా బాగుంటుంది.



## దబ్బకాయ పొక్కింపు

**కావలసిన పదార్థాలు:** పెద్ద దబ్బకాయ ఒక్కటి, ఆవాలు పెద్ద చెంచా, మెంతులు చిన్న చెంచా, ప్రియ్యాంగో కారం చిన్న గ్లాసు, నూనె చిన్న గిన్నెడు, పసుపు చిటికెడు, ఇంగువ చిన్న చెంచా, ఉప్పు తగినంత



**తయారీ విధానం**

ముందుగా స్టౌ వెలిగించి, మూకుడు పెట్టి, అది వేడి అయ్యాక నూనె వేసి, కాగాక, తరిగిన దబ్బకాయ ముక్కలు వేసి, అందులో ఉప్పు వేసి మూత పెట్టి ఉడికించాలి. అది ఉడికాక గిన్నెలోకి తీసుకుని చల్లగా అయ్యాక, మళ్లీ స్టౌ వెలిగించి వేరే మూడుకు పెట్టి, అది వేడి అయ్యాక, నూనె వెయ్యకుండా, ఆవాలు, మెంతులు వేయించి పక్కన పెట్టుకోవాలి. అవి చల్లగా అయ్యాక, మిక్సీలో వేసి గ్రౌండ్ చేసుకోవాలి. దబ్బకాయలో కారం, మెంతిపిండి, పసుపు వేసి బాగా కలపాలి. తర్వాత స్టౌ వెలిగించి, మూడుదు పెట్టి, చిన్న గిన్నె నూనె వేసి, వేడి అయ్యాక, స్టౌ ఆఫ్ చేసి, అందులో ఇంగువ వేసి, దబ్బకాయ పొక్కింపులో వేసి బాగా కలపాలి. ఇలా కలిపిన దబ్బకాయ చిన్న గిన్నెలో పెట్టుకుని, వేడి వేడి అన్నంలో నెయ్యి వేసుకుని తింటే బాగుంటుంది. ఈ దబ్బకాయ పొక్కింపు ఒక్క పది రోజులు బాగుంటుంది. తడి తగలకుండా వుంటే మంచిది.

- చెంగల్వల కామేశ్వరి

కథ

# పుస్తకాలు కొంటాం

ఎం.ఆర్.వి. సత్యనారాయణ మూర్తి

**"హలో! శ్రీధర్‌గారేనా?"**

**"అవునండీ, నేనే మాట్లాడుతున్నా.. మీరు?"**

**"నేనండీ జి.గుర్నాథాన్ని, అమలాపురం నుంచి మాట్లాడుతున్నా. మీ కథల పుస్తకం 'వీడిన మబ్బులు' గురించి ఆదివారం సంచికలో వచ్చిన సమీక్ష చదివాను. మా కోనసీమ కొబ్బరిబోండాం నీళ్లు తాగినంత హాయిగా ఉంది. మా స్నేహితులందరం 'తెలుగు వికాస సమితి' సంస్థ నడుపుతున్నాం. మీ కథల పుస్తకాలు ఇరవై పంపండి. అందరం చదువుకుంటాం. మీకు గూగుల్ పే ఉందా?"**

"ఉందండీ. మీరు ఇప్పుడు మాట్లాడుతున్న నెంబర్‌కే గూగుల్ పే ఉందండి" చాలా వినయంగా చెప్పాడు శ్రీధర్.

"సరే. ఇప్పుడే గూగుల్ పే చేసి నా అడ్రసు పెడతాను. వెంటనే పుస్తకాలు పంపండి"

"ఓకే. వెంటనే పంపుతాను" సంతోషంగా అన్నాడు శ్రీధర్.

"అబ్బబ్బా. వెధవ పలవరింతలూ.. మీరూనూ. బంగారం లాంటి నిద్ర పాడుచేసారు.. లేవండి" అంటూ జగదంబ రెండు కుదుపులు కుదిపేసరికి కళ్లు తెరిచాడు శ్రీధర్.

అయితే ఇదంతా కలా? అనుకుని సెల్‌ఫోన్ తీసి టైమ్ చూసాడు. అయిదు గంటలు.

"ఏమిటీ, వెంటనే పుంపుతాను అంటున్నారు. మళ్లీ మీ జిడ్డు గుర్నాథంగాడు ఏమైనా బొప్పాయిచెట్లు స్కీములో చేరమంటున్నాడా? ఈసారి వాడు 'అక్కయ్యా కాఫీ' అంటూ రాగానే కాఫీలో విషం కలిపి చంపేస్తాను. దొంగవెధవ.. దొంగవెధవ.." అంటూ కళ్లు ఉరిమి చూసింది జగదంబ.

"అబ్బే, అదేంలేదు జగ్గూ. నా కథల పుస్తకాలు ఇరవై పంపమని అడిగితే, పంపుతాను" అన్నాను అంతే.

"ఏమిటీ, కలలో అడిగారా? బాగానే ఉంది సంబడం. ముప్పై వేలు ఖర్చు పెట్టి వేసారు. మూడు పుస్తకాలు కూడా అమ్ముడవలేదు. సరేగానీ, లేచి పళ్లు తోముకుని కాఫీ తీసుకురండి. తాగి వాకింగ్‌కి వెళ్లాలి" అని ముసుగెట్టి పడుకుంది జగదాంబ.

భార్య మాటలకు ఎదురుచెబితే గిన్నెలు, కంచాలు 'రూపాంతరాలు' చెందుతాయన్న సంగతి పెళ్లయిన మర్నాడే అతనికి బోధపడింది. లేచి బాత్‌రూమ్‌కి వెళ్లి ఆలోచించసాగాడు. తెల్లవారుఝామున వచ్చిన కల నిజం అవుతుందని బామ్మ చెప్పిన విషయం గుర్తుకు వచ్చి శోభనం గదిలో పెళ్లికొడుకులా ఆనందపడ్డాడు.

.............

ఉదయం పది గంటలయ్యింది. ఆదివారం అవడం వలన టిఫిన్ తినేసి రెండోసారి పేపరు చదువుతున్నాడు శ్రీధర్.

జగదంబ లోపల వంటపనిలో ఉంది.

శ్రీధర్ సెల్ మోగింది. "హలో, శ్రీధరమేనా?" పెద్ద వయసావిడ అడిగింది.

"అవునండీ.. మీరు..?" చాలా వినయంగా అడిగాడు శ్రీధర్.

"నేను నారాయణపురం నాంచారమ్మని. నీ కథల పుస్తకంలోని కథలన్నీ బాగున్నాయని ఆదివారం పత్రికలో చదివానురా అబ్బాయ్. అభినందనలు.. నాకో పుస్తకం కావాలి, పంపుతావా?"

"అలాగేనండి. మీరు మాట్లాడుతున్న నంబర్‌కి గూగుల్ పే ఉంది. మీరు పుస్తకం ఖరీదు వంద రూపాయలు పంపితే రిజిస్టరు పోస్టులో మీకు పుస్తకం పంపుతాను" ఆనందంగా చెప్పాడు శ్రీధర్.

"సరే, నీకు ఏభై రూపాయలు పంపుతాను. పుస్తకం పంపు. నా అడ్రసు రాసుకో. ఎన్.నాంచారమ్మ, వేపచెట్టు వీధి, నారాయణపురం, తుని మండలం, కాకినాడ జిల్లా.

"అది కాదండీ.. పుస్తకం ఖరీదు వంద రూపాయలు కదా" కంగారుగా అన్నాడు శ్రీధర్.

"ఆ సంగతి నాకు తెలుసు. నువ్వు పుస్తకాలు అమ్మేవాళ్లకిస్తే వాళ్ల కమిషన్ ఏభై



శాతం తగ్గించే కదా నీకు ఏభై ఇస్తారు. అందుకే నేను ఏభై పంపుతాను".

"మీరు ఏభై పంపితే, నేను ఇరవై రూపాయలు పోస్టువాళ్లకిస్తే ఇక నాకు మిగిలేదేముంది నా బొంద.

ముప్పై రూపాయలు. పుస్తకం ఖర్చులు కూడా రావండీ" దీనంగా అన్నాడు శ్రీధర్.

"అబ్బాయి శ్రీధరం! మనిషి జీవితం నీటిబుడగ. ఎప్పుడు 'టుప్'మని ముగిసిపోతుందో తెలియదు. అందుకే నేను నీకో ఉపకారం చేయాలనుకుంటున్నాను. నేను నీ పుస్తకం చదవగానే మా ఊళ్లో పదిమంది చేత నీ పుస్తకాలు కొనే ఏర్పాటు చేస్తాను. ఈసారికి ఇలా కానీయ్" అని ఫోన్ కట్ చేసింది నాంచారమ్మ.

మరునిమిషంలో శ్రీధర్‌కి ఏభై రూపాయలు గూగుల్ పే వచ్చాయి. అది చూసి ఇంకో పది మంది కూడా ఇలా ఏభై రూపాయలు పంపుతారా? అని విలవిలలాడిపోయాడు.

ఇంకో అరగంటలో మరో ఫోన్.. "కథా రచయిత శ్రీధర్ గారేనా?" అంటూ తనని రచయితగా గుర్తించినందుకు భాగ్యలక్ష్మి బంపర్ లాటరీ తగిలినంత ఆనందం కలిగింది శ్రీధర్‌కి.

"నేనే శ్రీధర్‌ని, చెప్పండి" అని అన్నాడు.

"మీ కథల పుస్తకం రివ్యూ చూసాను. నాకు కథలంటే చాలా ఇష్టం. నేను రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగిని. నాలాగే కథలంటే ఇష్టమున్న ఓ పది మందిమి ఉన్నాం".

ఒక్క క్షణం ఆగాడు నాగభూషణం. ఆయన మాటలు వింటుంటే శ్రీధర్ మనసు పాలకొల్లు గోపురం ఎక్కి గాలిపటం ఎగరేసిన పిల్లాడిలా ఆనందంతో గంతులు వేసింది.

"శ్రీధర్‌గారూ, మేం మీ కథల పుస్తకం ఓసారి చదివి, ఎన్ని కాపీలు కావాలో చెబుతాం. ఓ పుస్తకం బుక్ పోస్టులో నాకు పంపండి. మేమంతా మీ పుస్తకం చదివాకా ఓ మీటింగు వేసుకుని, ఏం చేయాలో నిర్ణయించుకుంటాం. మీరు చాలా కథలు రాయాలని, ఇంకో పుస్తకం కూడా వేయాలని కోరుతున్నాం. నా అడ్రసు మెసేజ్ పెడుతున్నాను. ఆల్ ది బెస్ట్" అని ఫోన్ కట్ చేశాడు నాగభూషణం.

"కథా రచయిత శ్రీధర్‌గారేనా?" అంటూ తనని రచయితగా గుర్తించినందుకు భాగ్యలక్ష్మి బంపర్ లాటరీ తగిలినంత ఆనందం కలిగింది శ్రీధర్‌కి. "నేనే శ్రీధర్‌ని, చెప్పండి" అని అన్నాడు.

అతని మాటలకు బుర్ర తిరిగిపోయింది శ్రీధర్‌కి. ఒక్క పుస్తకం కొనాలంటే మీటింగు వేసుకుంటారా? ఏం మనుషులురా బాబూ? అని చిరాకు పడ్డాడు. జండూబామ్ రాసుకుని కళ్లు మూసుకుని సోఫాలో వెనక్కి చేరబడి కూర్చున్నాడు.

పావుగంట తర్వాత ఫోన్ మోగింది. "జై శ్రీరాం.. నేను సూర్యనారాయణ శాస్త్రిని. అనంతపురం నుంచి మాట్లాడుతున్నా. నేను ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇస్తూ ఉంటాను. నీ పుస్తకం ఒకటి పంపితే అందులోని చమక్కులు నా ఉపన్యాసం మధ్యలో చెబుతా. నా అడ్రసు పెడతాను. జై శ్రీరామ్" అని ఫోన్ కట్ చేసారు శాస్త్రిగారు.

ఆయన మాటలు వినగానే పరీక్షల్లో అన్ని సబ్జెక్టులు ఫెయిల్ అయిన ఇంటర్మీడియట్ విద్యార్థిలా మతిపోయింది శ్రీధర్‌కి. తన కథలలో హాస్యం, చమక్కులు ఆయన ఉపన్యాసంలో చెబుతాడా? భలే మనిషి. అయినా ఇలా అయిందేమిటి తన పరిస్థితి. అసలు జనాలు ఏమనుకుంటున్నారు రచయితల గురించి? తన కల ఇలా అయిందేమిటి? మథనపడ్డాడు శ్రీధర్.

ఒక ఏడాది గడిచింది. శ్రీధర్ పుస్తకాలు ఒక్కటీ గడప దాటలేదు. జగదాంబ దెప్పుతూనే ఉంది భర్తని.

ఒక ఆదివారంనాడు వీధిలో దూరంగా "పాత పేపర్లు కొంటాం.. పుస్తకాలు కొంటాం" అన్న కేక వినపడింది శ్రీధర్‌కి.

కేక దగ్గరగా రాగానే గుమ్మం దిగి అతని దగ్గరకెళ్లాడు. మాటలు కుదిరాయి. ఐదు నిమిషాల్లో శ్రీధర్ పుస్తకాలు ఆటోలోకి విచారంగా వెళ్లాయి. ●

## నలభై సార్లు

సుబ్బారావు: అప్పారావ్! నేను అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇమ్మని నీ దగ్గరకు నాలుగు సార్లు వచ్చాను.

అప్పారావు: అప్పు అడగడానికి నీ దగ్గరకు నలభై సార్లు వచ్చాను, దానికేమంటావు మరి?

సుబ్బారావు: ఆ... అంటూ నోరెళ్లబెట్టాడు.

## పట్టపగలే..!

లాయర్: పట్టపగలు దొంగతనం చెయ్యడానికి నీకు ఎన్ని గుండెలురా?

దొంగ: మరేం చెయ్యమంటారండీ? టీవీ సీరియల్స్ చూస్తూ రాత్రుళ్లు ఎవరూ పడుకోవటం లేదు.

**- వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం

## అమ్మాయిలుండరుగా!

పూజారి: నెల రోజుల నుండి నువ్వు గుడికి రావడం లేదు. ఇవాళ సడన్‌గా ప్రత్యక్షమయ్యావేంటి?

భక్తుడు: మొన్నటివరకు కాలేజి ఎగ్జామ్స్ జరిగాయి. అందుకే ఈరోజు వచ్చాను.

పూజారి: ఎగ్జామ్స్‌కి, గుడికి సంబంధం ఏమిటి?

భక్తుడు: ఎగ్జామ్స్ ఉంటే అమ్మాయిలు గుడికి రారు కదా! అందుకని.

పూజారి: ఇంకేమంటాడు..

**- ఎస్.కె.యాకుబ్ పాషా,** ఖమ్మం

## ఏసీ ఉంటుందిగా!

"బయట ఎండ మండిపోతోంది. గదిలో నువ్వు ఫ్యాన్ లేకుండా ఉండగలవా?"

"అసలు వుండలేను.. నేనే కాదు, ఎవరూ ఉండలేరు"

"నేను ఉంటాను"

"నిజమా? నువ్వు చాలా గ్రేట్‌రా!"

"అవును.. ఫ్యాన్ లేకపోతేనేం? ఏసీ ఆన్ చేసే వుందిగా"

"హా..!?"

**- చలపాక ప్రకాష్**



# కర్మఫలం లభించేనా!

జగన్మాత పార్వతీదేవి పరమేశ్వరుడిని "శుభాశుభ కర్మఫలాలను గ్రహజనితములని తలచి ఆ గ్రహ నక్షత్రాలను ఆరాధిస్తూ ఉంటారు. ఇది సరైనదా? దయచేసి ఈ సందేశం నివృత్తి చేయగలరు!"

జగన్మాత పార్వతీదేవి అడిగిన ప్రశ్నకు పరమేశ్వరుడు ఇచ్చిన సమాధానం:

**శ్లో: స్థానే సంశయితుం దేవి శృణు తత్వ వినిశ్చయం**
**నక్షత్రాణి గ్రహాశ్చైవ శుభాశుభ నివేదకాః**
**మానవానాం మహా భాగే నతు కర్మకరాః స్వయం**

అర్థం: ఉచితమైన సందేహాన్ని నా ముందుంచావు. ఈ విషయంలో గల సిద్ధాంత మతాన్ని విను. గ్రహాలు, నక్షత్రాలు శుభా శుభముల సూచనలు మాత్రమే ఇవ్వగల్గినవి. అవి స్వయంగా ఏ పనీ చేయవు!

**శ్లో॥ ప్రజానాంతు హితార్థాయ శుభాశుభవిధిం ప్రతి**
**అనాగతమతిక్రాంతం**
**జ్యోతిశ్చక్రేణ బోధ్యతే**

అర్థం: ప్రజల హితవు కోసం జ్యోతిశ్చక్రం ద్వారా భూత, భవిష్య కాలంలోని శుభా శుభ ఫలములను బోధించటం జరుగుతుంది.

**శ్లో॥ కింతు తత్ర శుభం కర్మ సుగ్రహైసు నివేద్యతే.**
**దుష్కృత స్యాశుభైరేవ**
**సమవాయో భవేదేతి**

అర్థం: కానీ అక్కడ శుభ కర్మఫలం సూచన ఉత్తమ గ్రహాల ద్వారా లభిస్తుంది. అలాగే దుష్కర్మ ఫలం సూచన అశుభ గ్రహాల వలన తెలుస్తుంది.

**శ్లో॥ కేవలం గ్రహ నక్షత్రం న కరోతి శుభా శుభం**
**సర్వమాత్మకృతం కర్మలోకవాదో గ్రహ ఇతి**

అర్థం: కేవలం గ్రహ నక్షత్రాలు శుభా శుభ కర్మఫలములను ఇవ్వటం లేదు. సమస్తం స్వయంకృత కర్మల వలనే శుభా శుభ ఫలములు ప్రాప్తిస్తాయి. గ్రహములు ఏదో చేసాయి అనేది లోకవాదము మాత్రమే!

స్థూలంగా చూసినా, సూక్ష్మంగా చూసినా 'కర్మ' అనే అద్భుతమైన అంశం దగ్గర ఆలోచన ఆగిపోతుంది.

కర్మ అనేది 'ఖర్మ' కానేకాదు. సత్కర్మను యోగిలా ఆచరించటం భారతీయ తత్వ చింతన. వివాహం కూడా ఒక సత్కర్మ. ఇది పురుషార్థానికీ, ప్రజోత్పత్తికి, వంశ వృద్ధికి సంబంధించిన ఒక యజ్ఞం.

గీతామృతం ఈ సందర్భంలో ఏమి బోధించిందో చూద్దాం.

**శ్లో॥ అపి చేదసి పాపేభ్యః సర్వేభ్యః పాప కృత్తమః**
**సర్వం జ్ఞాన ప్లవేనైవన వృజినం సంతరిష్యసి (గీ.4-36)**

పరమాత్మ: ఒకవేళ పాపాత్ములందరి కంటెను నీవు ఈ ఒక మహాపాపివి అయినచో, జ్ఞానానేక సహాయంతో పాప సముద్రంలో నుండి నిస్సందేహంగా పూర్తిగా బయట పడగలవు.

**శ్లో: యథైధాంసి సమిద్ధోగ్నిః భస్మ సాత్కురుతేర్జున**
**జ్ఞానాగ్నిః సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా (37)**

పరమాత్మ: ఓ అర్జునా! ప్రజ్వలించుకున్న అగ్ని సమిధలను భస్మం చేసినట్ల జ్ఞానమను అగ్ని కర్మలనన్నింటిని భస్మమొనరించును.

**శ్లో॥ యోగ సన్న్యస్త కర్మాణం జ్ఞాన సంఛిన్న సంశయమ్**
**ఆత్మవంతం న కర్మాణి నిబధ్నంతి ధనంజయ (41)**

పరమాత్మ: ఓ ధనంజయా! విధి పూర్వకంగా కర్మలను ఆచరించుచు, కర్మ ఫలములను అన్నింటిని భగవదర్పణం చేయుచు, వివేకం ద్వారా సంశయములన్నింటిని తొలగించుకొనుచు, అంతఃకరణమును వశమునందుంచుకొనిన వానిని కర్మలు బంధింపజాలవు.

వన పర్వంలో ద్రౌపది ధర్మరాజుని క్షత్రియునిలాగా యుద్ధం చేసి రాజ్యం తిరిగి సంపాదించమని అంటుంది. మనసు ఎక్కడో పెట్టుకుని వేదమంత్రాలు వల్లిస్తున్న బ్రాహ్మణునిలాగా కబుర్లు చెప్పవద్దంటాడు భీముడు. ధర్మరాజు క్రోధం, తేజం, క్షమ అనే అంశాల గురించి వివరిస్తూ వాటిని కర్మతో అనుసంధానం చేస్తాడు.

'ఘటన' అనేది కర్త, కర్మ, క్రియలకు ఏ దిక్కుగా అన్వయమవుతుందో, ఈశ్వరుని ఆశీర్వాదం ఎటువంటి కర్మను ఆచరించేవారికి ఘటన ద్వారా సంప్రాప్తిస్తుందో చెబుతాడు.

ఆ తరుణంలో వ్యాసుడు ప్రత్యక్షమై 'ప్రతిస్మృతి' అనే విద్యను ఉపదేశించి అర్జునుడికి బోధించమని చెబుతాడు.

తాత్పర్యం ఏమిటంటే సరైన కర్మలను ఆచరిస్తూ తనను తాను 'గీత' మీద నిలబెట్టుకున్న వ్యక్తికే కొన్ని అర్హతలుంటాయి. అందుచేత జ్యోతిషం విషయంలో కావలసింది ఈ ఘటనకూ, కర్మలకూ, వాటిని సూచించే గ్రహాలకూ గల అనుసంధానం. అది లేని చోట గ్రహాలూ, నక్షత్రాలూ, శాంతులు, దశదిశలు అన్నీ భయపెట్టేవే.

..........

సుబ్బారావుకు 'సత్కర్మ' వివాహం అనే మాటలు గట్టిగా తగులుతున్నాయి. ఆలోచించాడు.

"కరెక్ట్. ఒక్కసారి వివాహం ముందు జరుపుతున్న సంగీత్ లాంటి కార్యక్రమాలను చూస్తే మనం దారి తప్పి ఎంత దూరం వచ్చేసామో కనిపిస్తోంది. ఇక సదాచారం, సహనం వైవాహిక బంధం పట్ల సరైన గౌరవం, నిజమైన అనుబంధం ఎక్కడి నుండి ఏర్పడతాయి?"

'సరైన బ్రహ్మచర్యం, సరైన గృహస్థాశ్రమం.. ఈ రెండింటికీ మధ్య వారధి వివాహం అయినప్పుడు, ఆ రెండూ సరిగ్గా లేనప్పుడు ఈ వైవాహిక వ్యవస్థ కూడా నాశనమైన పరిస్థితి కనిపిస్తోంది కదా!?

"అయ్యా! శారీరక, మానసిక సంబంధం, కలయిక, శృంగారం అనేవి వైవాహిక జీవితంలో ఒక భాగంగా చెప్పుకున్న చింతన మనది. వాటి కోసం వివాహం అనే ఆలోచన ఆ నేపథ్యాన్ని పూర్తిగా మార్చేస్తుంది". "ఇది ఆలోచించాలి. విచ్చలవిడి శృంగారం వలన కలిగే అనర్థాలు ఎటువంటివి అనేది ప్రపంచం చూసింది".

"కరెక్ట్. ఒక్కసారి వివాహం ముందు జరుపుతున్న సంగీత్ లాంటి కార్యక్రమాలను చూస్తే మనం దారి తప్పి ఎంత దూరం వచ్చేసామో కనిపిస్తోంది. ఇక సదాచారం, సహనం వైవాహిక బంధం పట్ల సరైన గౌరవం, నిజమైన అనుబంధం ఎక్కడి నుండి ఏర్పడతాయి?"

"ఇక జాతకాలు పోల్చటం ఎందుకు సార్?"

"మన పూర్వీకులు పోల్చుకున్నారా?"

"లేదు" "మరి?"

"తప్పటంలేదు కదా! ఇక్కడ నా ఆలోచన కాదు కదా!

**(మిగతా 27వ పేజీలో..)**

# ఏడుపు మంచిదే!

**ఒకరికి ఏడవాలనిపిస్తోందంటే వెంటనే ఒంటరిగా ఓ మూల కూర్చుని ఏడవటం మొదలుపెట్టొచ్చు. అతనికే నవ్వాలనిపిస్తోందంటే వెంటనే ఒంటరిగా కూర్చుని నవ్వడం మొదలు పెట్టకూడదు.**

**చూసేవాళ్లు అతని తీరుకు అనుమానిస్తారు. అతని వంక అదోలా చూస్తారు. నిన్న మొన్నటి వరకూ బాగానే ఉన్నాడు కదా ఇప్పుడేమైంది.. ఇలా ఒక్కడే కూర్చుని నవ్వుతున్నాడు, ఏదైనా గతి తప్పేడా అనుకుంటారు. ఆలోచనలో పడతారు.**



అయినా ఎలా ఉన్నా సరే...

నోరారా నవ్వడం మన శరీరానికి ఎంత మంచిదో అలాగే ఏడవడమూ మంచిదే.

మానసిక నిపుణులు అలా అన్నట్టు అప్పుడెప్పుడో చదివాను.

అయితే మనం అనుకునేదేమిటంటే–

ఏడవటం పిరికితనానికి చిహ్నమని అనుకుంటాం. అంతేకాదు, మగవారు ఏడిస్తే అది వారికి హీనమైనది అని అనుకుంటాం.

నిజానికి తరతరాలుగా వస్తున్న ఓ తప్పుడు అభిప్రాయమిది అని కూడా మానసిక నిపుణులు చెప్తున్నారు.

అవసరానికి మించి తిన్నప్పుడు అది పొట్టలో ఇమడక వాంతి రూపేణా బయటకు వచ్చేస్తుంది. అలాగే, మనసుకి అక్కర్లేనిది ఏడుపు రూపంలో బయటకు వచ్చేస్తుంది.. అంతే. అంతకన్నా మరొకటి కాదు.

మనసులో అణచుకోలేని కొన్ని విషయాలు గూడు కట్టుకున్నప్పుడు అది ఏడుపు రూపంలో బయటకు వచ్చేస్తుంది. అది సముచితమేగా.

మనసారా ఏడ్వనివ్వండి.. అని ఓ కవి చెప్పిన విషయం ఇందుకేనేమో.

నిజం చెప్పాలంటే ఏడ్వటానికి కూడా ధైర్యం ఉండాలి. అలా ఏడ్చినప్పుడు మనసులోని బరువు తగ్గి తేలిక పడుతుంది.

ఇది ఆడా, మగా ఇద్దరికీ చెందినదే. అంతేతప్ప స్త్రీ మాత్రమే ఏడ్వాలనీ, మగవారైతే ఏడవకూడదని ఎక్కడా లేదు. ఎవరో ఏదో అనుకుంటారని కాదు.

మనలోని బాధను బయటకు పంపించేయడానికి ఏడ్పు అనేది ఓ ఆయుధం. అంతేతప్ప అదేమీ తక్కువో, తప్పో కాదు.

నోరారా నవ్వేటట్టు నోరారా ఏడ్వడమూ సముచితమే. నిజానికి అదే మంచిది కూడా.

అలాగని ఎప్పుడూ ఏడుపు ముఖంతో ఉంటే చూడ్డానికి ఏమాత్రం బాగుండదు. కనుకనే ఒంటరిగా ఓ మూల కూర్చుని ఏడ్చి మనసుని తేలిక చేసుకోవడం మంచిది.

ఏడ్వటం అయిన తర్వాత ముఖం తుడుచుకుని ఇవతలకు వచ్చెయ్యాలి.

నిపుణులు ఇలా చెప్పారు కదాని అయినదానికి కానిదానికి ఏడిస్తే నలుగురి మధ్యా తిరగటం ఏమాత్రం బాగుండదు.

ఏదో ఒకటి జరగరానిది జరిగి మనసుకి కష్టం కలిగినప్పుడు ఏడ్చి మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడం మేలు. అది అక్కడితో వదిలెయ్యాలి. అప్పుడే మనసుకి మంచిది.

అయినా ఏడ్పులో ఎన్నో రకాలు ఉన్నాయి. ఓ యువకుడు ఏడుస్తూ కూర్చున్నాడు.

"ఎందుకు ఏడుస్తున్నావని?" అతనిని ఒకడడిగాడు. "మా తాత చనిపోయారు" అన్నాడా యువకుడు.

"మీ తాతకు ఎన్నేళ్లు?" అని అడిగాడతను.

ఆ యువకుడు "తొంభై అయిదేళ్లని" చెప్పాడు.

"అదేమిటీ? అన్నేళ్లు బతికారుగా! దానికెందుకు ఏడ్వటం?" అని అడిగాడు.

అప్పుడు ఆ యువకుడు "నేను ఆయన చనిపోయారని ఏడ్వటం లేదు సార్. ఆయన ఎప్పుడో ఎక్కడో అప్లయ్ చేసుకుంటే ఈరోజు మా తాతయ్యకు ఇంటర్వ్యూ కార్డు వచ్చిందండి. అది చూడకుండా ఆయన చనిపోయారనే నా బాధంతా. అందుకే ఏడుస్తున్నాను" అన్నాడా యువకుడు.

**- యామిజాల జగదీశ్**


## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి.

ఎంపిక కాని కార్టూన్ల తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:

ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-500 080.


sunmagvaartha@gmail.com

# 'జ్ఞానపీఠ' కవి డా॥సినారె




భారతీయ సాహిత్యంలో అత్యున్నత పురస్కారమైన 'జ్ఞానపీఠ' అవార్డును అందుకొన్న డాక్టర్ సి.నారాయణరెడ్డి తెలుగు సాహిత్యంలోని 18 ప్రక్రియలలో 80కి పైగా అత్యుత్తమ రచనలతో అగ్రగణ్యత సాధించిన మహాకవి. సినారెగా తెలుగు ప్రజ ఆత్మీయంగా గౌరవించుకొనే డాక్టర్ నారాయణ రెడ్డి అరవై సంవత్సరాల సాహితీ ప్రస్థానం నిత్యనూతన పురోగమన చైతన్యంతో తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసింది. యువ కవిగా నవ్య, భావ, అభ్యుదయ సాహితీ ధోరణులు కదిలించినా, నారాయణరెడ్డి ఎవరి ప్రభావం లేని స్వంత గొంతుకతో, ఎనలేని కీర్తి ప్రతిష్టలు పొందారు.

'నవ్వని పువ్వు' గేయ నాటికతో ఆరంభమైన సినారె సాహితీ వ్యాసంగం, వివిధ సాహితీ ప్రక్రియల సృజనాత్మక ప్రతిభతో తెలుగు సాహిత్యాన్ని నడిపించింది.



1953లో 'జలపాతం' ఖండకావ్య సంపుటిని దాశరథికి అంకితం యిచ్చారు. 1950-60 దశకంలో రమణీయ గేయ రూపాలు అజంతా సుందరి, వెన్నెలవాడ, రామప్ప వర్ణనాత్మక గేయ కావ్యం, ఋతుచక్రం, నవ్య ప్రౌఢ గేయ కావ్య ప్రబంధ రచనలు, నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథ నాయకుడు, జాతిరత్నం వేనోళ్ల ప్రశంసలు పొందాయి. కర్పూర వసంతరాయలు కావ్యంలో సినారె కథాకథనం, వర్ణనా వైచిత్రి, రసపాత్ర పోషణ, వ్యంగ్య ప్రమాణ పద ప్రయోగాలు, ఛందో వైవిధ్యం సాటిలేనివని ఆచార్య దివాకర్ల శిష్యుణ్ణి అభినందించారు.

విలక్షణ గేయ కథాకావ్యంగా 'నాగార్జున సాగరం' మధురమైన భాష రమణీయ భావనలతో విద్వత్కవులను విస్మయపరిచిన మహాకావ్యం.

“ఆ పెదవి మెదిపితే ఆణిముత్యాలు.. ఆ కలం కదిపితే అందాల హరివిల్లు” అన్నారు కరుణశ్రీ సినారె గురించి.

సినారె రచన 'ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయాలు ప్రయోగాలు' తెలుగు సాహిత్య ఆవిర్భావ, వికాసం తీరుతెన్నులకు ప్రామాణిక విద్యాగ్రంథమైంది.

జలపాతం, ఉదయం నా హృదయం, మంటలే మానవుడు, అక్షరాల గవాక్షాలు వంటి ఖండకావ్యాలు, ముక్తక కావ్యంగా సమదర్శనం, రామప్ప, తరతరాల వెలుగు వంటి నృత్య గేయ, నాట్య రూపకాలు, గాంధీయం, మీరాబాయి, ముత్యాల కోకిల, శిఖరాల లోయలు వంటి అనుసృజనాలు, విశ్వగతి, స్వప్నభంగం, భూమిక వంటి దీర్ఘగేయాలు, ఊర్మిళ, వరూధిని వంటి వచన నాటికలు, సినారె సమగ్ర సాహిత్యం 18 సంపుటాలుగా తెలుగు సాహిత్య మణిదీపాలుగా వెల్లివిరిసాయి.

1980లో వెలువడిన 'విశ్వంభర' ఒక దీర్ఘ కావ్యంగా మనిషి ఉత్థానం, పతనం వంటి దశలు, వైజ్ఞానిక, సామాజిక కవితా స్పృహతో పరిశీలించిన ప్రకృతి నిరంతర చైతన్య సంకేతంగా సాగుతుంది. కావ్యబింబ పరికల్పనతో, మహాకవి సినారె తాత్త్విక దృక్పథంతో సృష్టించిన ప్రతీకాత్మక గీతాలు, విశ్వమానవ చైతన్య శక్తిని నిరూపించే మహాకావ్యంగా విశ్వంభవర, అనంత జీవన తాత్త్విక సత్యాలను ఆవిష్కరిస్తుంది. జ్ఞానపీఠాన్ని అధిరోహించిన మహాకవిగా, విశ్వంభరాచార్యునిగా గుర్తింపు తెచ్చింది. విశ్వంభర తరువాత మట్టి నుంచి ఆకాశానికి ఎగిసిన మానవ అన్వేషణగా మట్టిమనిషి ఆకాశం దీర్ఘ కావ్యం సృష్టించారు. మట్టిని స్థలానికి, ఆకాశాన్ని కాలానికి ప్రతీకలుగా తీసుకొని స్థలానికి, కాలానికి మధ్య మనిషి సాగిస్తున్న జీవన ప్రవాహాన్ని చిత్రీకరించటం ఈ దీర్ఘ కావ్య విశిష్టత. మనిషిని కవిత్వ శిఖరంపై అధిష్ఠింపచేసిన సినారె, విశ్వమంతా శాంతి సౌఖ్యాలతో వుండాలనే కాంక్ష వ్యక్తీకరిస్తారు. మానవ స్వభావంలోని సంకుచిత, స్వార్థ, అవిశ్వాస భావాలను విడిచి, మానవతా విలువల వ్యవస్థకు స్వాగతం పలకమని విశ్వకవిగా సినారె మనిషిని అభ్యర్థిస్తాడు.

సినారె, సినిమా పాటలకు అద్భుత సాహితీ విలువలు అందించారు. 3500 సినీ గేయాలకు ప్రాణం పోసి తెలుగు చలనచిత్ర కళాఖండాలకు శాశ్వత విలువలు సమకూర్చారు.

**“ఇలాగే రాస్తూ ఉంటాను**
**అలసట అంటే ఎరుగని కలం**
**నా చేతిని నడిపించేంత వరకు**
**శ్వాసలోని ధారాగతులు**
**అక్షరాలై ప్రవహించేంత వరకు”**

అంటారు.

నేను ఎక్కుపెడుతున్న ఈ ప్రశ్నలు అంటూ “నిస్పృహ మాటున అణిగివున్న ధర్మాగ్రహం జూలు విదిలించుకొని శిరమెత్తితే తప్ప మూగవోయిన జన చైతన్యం గర్జించదు”. నిరంతరం సాహితీ జీవనయానంలో పురోగమించిన మహాకవిగా సినారె 'ఏవీ! ఆ జీవనిధులు', 'నా చూపు రేపటివైపు' , 'అలలెత్తే అడుగులు', 'పుట్టినరోజు సందర్భంగా ఏటా కొత్త కావ్యం తుదిశ్వాస వదిలేవరకు రాస్తూనే ఉన్నారు.

**నారాయణరెడ్డి కవీ!**
**నవ్య గేయ మహాకవీ!**
**ఆంధ్రుల హృన్నీరేజము**
**లందువెల్లు కళారవీ!** అన్నారు

జె.బాపురెడ్డి.

**- జయసూర్య**

# శిల్పకళా భాండాగారం 'అంగ్‌కోర్ వాట్'

షేక్ అబ్దుల్ హాకీం జాని

మహావిష్ణువు కొలువై వున్న ప్రపంచంలో అతి పెద్ద దేవాలయంగా భాసిల్లుతున్న దేశం కంబోడియా. ఈ దేశం రాజధాని ఫినామ్‌ఫెన్‌కు దక్షిణాన 300 కి.మీ. దూరాన నెలకొని వున్న ప్రాచీన దేవాలయాల శిల్ప సంపద అంగ్‌కోర్ వాట్. ప్రపంచ చారిత్రక కట్టడాలలో ఒకటిగా పేరు సంపాదించిన ఈ ఆలయాలన్నీ అద్భుతమైన శిల్పకళా నైపుణ్యంతో నిర్మించారు.

ఈ ఆలయాల సముదాయం హైందవ, బౌద్ధ సంస్కృతికి ప్రతీకగా నిలిచి ఉన్నాయి. ప్రపంచ ఆధునిక నాగరికతల్లో ఒకటిగా చెప్పబడే 'ఖ్మేర్' సామ్రాజ్య కాలంలో నిర్మించినట్లు చెబుతుంటారు. ఒకప్పుడు ఖ్మెర్ సామ్రాజ్యంగా ప్రజలు పిలిచిన కంబోడియాకు 9 నుండి 14 శతాబ్దాల మధ్య కాలంలో అంగ్‌కోర్ వాట్ రాజధానిగా ఉండేది. ఖ్మేర్ సామ్రాజ్యం ఆగ్నేయాసియాలోని హిందూ-బౌద్ధ సామ్రాజ్యంగా భాసిల్లిన ఈ ప్రాంతం ఇప్పుడు ఉత్తర కంబోడియాలో ఉన్న హైడ్రాలిక్ నగరాల చుట్టూ కేంద్రీకృతమై ఉంది. ఈ ప్రాంతాన్ని ఇక్కడ నివసించేవారు కంబుజా అని పిలుస్తారు. కంబోడియాలోని 'సీమ్ రీప్' అనే పట్టణానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది 'అంగ్‌కోర్ వాట్' దేవాలయం.

## బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు కలిసి ఉండే ఏకైక దేవాలయం

ప్రపంచంలో అతిపెద్ద హిందూ దేవాలయం ఏదంటే అంగ్‌కోర్ వాట్ విష్ణు దేవాలయం అనే విషయం మనలో చాలా మందికి తెలుసు. కంబోడియా ప్రభుత్వం ఈ విష్ణు దేవాలయ చిత్రాన్ని తమ జాతీయ జెండాపై ముద్రించింది. విష్ణువుకు అంకితం చేసినప్పటికీ ముఖ్యంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ఇక్కడ తిలకించవచ్చు. ఇది శిల్పకళ భాండాగారంగా విరాజిల్లే మానవ నిర్మిత పర్వతమని చెప్పవచ్చు. అంగ్‌కోర్ వాట్ స్వర్గానికి ప్రతిరూపమైన మేరుపర్వతాన్ని తలపించేలా ఉంటుంది. ముఖ ద్వారం వద్ద నాగుపాముల బొమ్మలు, సింహాల బొమ్మలు స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తాయి. అనేకచోట్ల ఆనాటి ఖ్మేర్ సామ్రాజ్య పరిస్థితులను శిల్పకళలో కళ్లకు కట్టినట్లు చూపించారు.

అంగ్‌కోర్ వాట్‌లో 65 మీటర్ల ఎత్తులో అయిదు భారీ గోపురాలను నిర్మించారు. ఇక్కడి దేవాలయాలపై నవ్వుతూ ఉన్న ముఖారవిందాలతో 200 వరకు విగ్రహాలు ఉన్నాయి. అంగ్‌కోర్ వాట్‌లోని అతి పెద్ద దేవాలయం మూడు అంతస్తులు ఉంటుంది. పర్యాటకులు మూడవ అంతస్తును చూడటానికి అనుమతించరు. ఈ ప్రాంతంలో పశ్చిమం వైపున అన్నీ విష్ణుమూర్తి విగ్రహాలు, ఉత్తరం వైపున శివుడి విగ్రహాలు, దక్షిణం వైపున బుద్ధుని విగ్రహాలు, తూర్పు వైపున ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాజులకు సంబంధించిన విగ్రహాలు ఉంటాయి. ఇక్కడ 213 అడుగుల ఎత్తులో నిర్మించిన భారీ గోపురం కింద అతి పెద్ద నిలువెత్తు విష్ణుమూర్తి విగ్రహం ఉంది. కాలగతిలో అది కొంతమేరకు శిథిలావస్థకు చేరుకుంది. దేవాలయం పై భాగానికి చేరుకోవడానికి మెట్లు నిర్మించారు. విష్ణువు ఆలయానికి చుట్టూ చిన్న చిన్న దేవాలయాలు ఉన్నాయి. తొలుత విష్ణు ఆలయంగా ఉన్న ఒక దేవళం తరువాతి కాలంలో బుద్ధుని ఆలయంగా మార్చారు. 'టోనెల్ సాప్' సరస్సు తీరాన 200 చదరపు కిలోమీటర్ల సువిశాలమైన ప్రదేశంలో 'కులేన్' పర్వత శ్రేణుల పాదాల వద్ద అంగ్‌కోర్ వాట్ దేవాలయం నిర్మించారు. ఇది ప్రపంచంలోని అతి పెద్ద హిందూ దేవాలయంగానే కాకుండానే అతి పెద్ద మహావిష్ణు దేవాలయంగా కూడా ప్రసిద్ధి చెందింది.

## యునెస్కో గుర్తింపు

సాధారణంగా హిందూ దేవాలయాలన్నీ భారతదేశంలో ఎక్కువగా ఉంటాయి.

అయితే విశ్వంలోనే అతిపెద్ద దేవాలయంగా పేరొందిన అంగ్‌కోర్ వాట్ దేవాలయం మాత్రం కంబోడియాలో ఉంది. ఇది ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కోవారి గుర్తింపును కూడా పొందింది. ఈ దేవాలయంలో ప్రపంచానికే తెలియని 200 వరకు అద్భుతమైన నాగరికతకు సంబంధించిన పెయింటింగ్ చిత్రాలను నాసా ఇటీవలే కనిపెట్టింది.







పురాతన దేవాలయాల్లో కంబోడియాలోని అంగ్‌కోర్ వాట్ దేవాలయం ఒకటి. ఈ దేవాలయం 200 చదరపు కిలోమీటర్ల సువిశాలమైన ప్రదేశంలో కంబోడియాలో ఉంది. పూర్వ కాలంలో ఈ ఆలయాన్ని 'యశోధర పూర్' అని పిలిచేవారు. అంగ్‌కోర్ వాట్ దేవాలయాలు తమిళనాడు దేవాలయాలతో పోలి ఉంటాయి. చోళరాజుల తరహాలో ఇక్కడి నిర్మాణాలు అంగ్‌కోర్ వాట్‌ను రాజధానిగా చేసుకుని పరిపాలించిన చక్రవర్తి రెండవ సూర్యవర్మన్(క్రీ.శ.1112-50) కాలంలో కట్టడం ప్రారంభించారని చరిత్రకారుల అభిప్రాయం. రెండవ సూర్యవర్మన్ సింహాసనాన్ని అధిష్టించిన పిదప మూడేళ్లకు క్రీ.శ.1116లో ఈ ఆలయ నిర్మాణం ప్రారంభించి ఉంటారని అంచనా. రెండవ సూర్యవర్మన్ 1150లో మరణించడానికి ముందు చాలా నిర్మాణాలు జరిగాయని తెలుస్తుంది. ఆ తరువాత ఏడవ జయవర్మన్ కాలంలో మిగిలిన నిర్మాణాలను పూర్తి గావించారు.

అంగ్‌కోర్ వాట్ దేవాలయానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండే మరో అద్భుత ప్రదేశం 'అంగ్‌కోర్ థోమ్'. ఖ్మేర్ సామ్రాజ్యంలోని చివరి చక్రవర్తులలో ఒకరైన ఏడవ జయవర్మన్ ఈ థోమ్‌ను రాజధానిగా చేసుకుని పరిపాలించినట్లు చారిత్రక ఆధారాల వల్ల తెలుస్తోంది. దీన్నే 'గ్రేట్ సిటీ' అని కూడా పిలుస్తుంటారు. 9 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ ఆలయం నిర్మాణం జరిగింది. దీని ప్రాచీన నామం కంపూచియా. యూరోపియన్ వలస దేశాల అజమాయిషీలోకి వెళ్లిన తర్వాత ఈ దేశం కాలక్రమంలో కంపూచియాగా మారిపోయింది. ప్రస్తుతం కంబోడియా, కాంబోడియా అని కూడా పిలుస్తారు.

## వేలాది కార్మికుల శ్రమ

అంగ్‌కోర్ వాట్ దేవాలయాల నిర్మాణానికి వేలాది మంది కార్మికులు ముప్పై సంవత్సరాలు పైబడి శ్రమించి పనిచేశారు. రాతితో నిర్మించిన ఈ ఆలయ సముదాయ గోడలపై క్షీరసాగర మథనం మొదలుకొని అనేక శిల్ప కళాఖండాలు ఉన్నాయి. అప్సరసలు, దేవాంగనల నగ్నమైన ఛాతీలతో మామిడిపండు ఆకారంలో



నడుమువంపులు పోలిన శరీరాకృతి అద్భుతంగా శిల్పీకరించారు. పలు నృత్య భంగిమల శిల్పాలు, యుద్ధ దృశ్యాలు ఇక్కడి స్థంభాలంపై చెక్కారు. అంగ్‌కోర్ వాట్ ఆలయ ముఖద్వారాన్ని కంబోడియా ప్రభుత్వ జాతీయ చిహ్నంగా గుర్తించింది. అంగ్‌కోర్ వాట్ దేవాలయాలను కఠినమైన రాతి శిలలతో నిర్మించారు. 14వ శతాబ్దంలో థాయ్ సైన్యం ఈ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నారు. సియామ్ రాజసైన్యం ఈ ప్రాంతాన్ని ధ్వంసం చేసింది. ఆ కారణంగా క్రీ.శ.1437 నుండి ఈ నగరం మరుగున పడిపోయింది. అడవులు పెరిగి వ్యవసాయ క్షేత్రాలు సైతం కనుమరుగైనాయి. నాటి నుండి ఇంత అద్భుత కట్టడం గురించి క్రీ.శ.1860 వరకు ప్రపంచ ప్రజలకు తెలియదంటే ఆశ్చర్యం కలగక మానదు. ఫ్రెంచ్ పురావస్తు శాస్త్రవేత్త హెన్రీమోహాల్ కంబోడియా సందర్శించి దీని చరిత్రను వెలికితీసి ఇక్కడి కళాఖండాలపై పరిశోధనలు చేశారు. ఈ ప్రాంతంలోని అనేక కళాఖండాలను పునర్నిర్మించాడు. అంతేకాక ప్రాచీన రోమ్, గ్రీక్‌లలో సైతం ఇటువంటి ప్రాచీన కళాఖండాలు లేవని ప్రకటించాడు.

ఫ్రెంచి శాస్త్రవేత్తలు ఒక బృందంగా ఏర్పడి ఈ ప్రాంతంలో అడవుల్లో అనేక కిలోమీటర్ల దూరం వరకు విస్తరించి ఉన్న శిథిల ఆలయాలను కనుగొన్నారు. 1957లో అంగ్‌కోర్ వాట్‌ను సందర్శించిన జర్మన్ పాత్రికేయుడు వోన్స్ వాల్టర్ బెర్గ్ ఇక్కడి దేవాలయాలు ఇతర దేవాలయాల కంటే కళాత్మకత ఉట్టిపడే విధంగా ఉన్నాయని పేర్కొన్నాడు.

1960 నుండి ఇక్కడకు ప్రపంచ పర్యాటకులు రావడం మొదలుపెట్టారు. 1986 నుండి 1993 వరకు అంగ్‌కోర్ వాట్ పునరుద్ధరణ కార్యక్రమం కోసం మన దేశం కూడా కొన్ని బృందాలను పంపింది.

1993లో జరిగిన ఒక సభలో జపాన్, ఫ్రాన్స్ నేతలు అంగ్‌కోర్ వాట్ అభివృద్ధి కోసం 10 మిలియన్ల యుఎస్ డాలర్లు ప్రకటించారు. ఆ సమయంలోనే అనేక దేశాలు ఈ ఆలయ పరిరక్షణకోసం నిధులు ప్రకటించాయి. యునెస్కోవారు ఈ ప్రదేశాన్ని ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించి యాత్రికుల కోసం సౌకర్యాలను మెరుగుపరచారు. ఫ్రాన్స్‌కు చెందిన బెర్నార్డ్ ఫిలిప్ గ్రాస్‌లర్ ఇక్కడి దేవాలయాల పరిరక్షణకు విశేషంగా కృషి చేశారు. గుడి గోడల నుండి నీరు స్రవించకుండా సిమెంట్ మార్బుల్‌తో మరమ్మత్తులు చేశారు. ఆలయంలోకి గబ్బిలాలు, గుడ్లగూబలు చేరకుండా చర్యలు తీసుకున్నారు.

## ఆకట్టుకునే శిల్పాలు

కొండలను తొలచి చెక్కిన అంగ్‌కోర్ వాట్ ఆలయ శిల్పశోభ రమణీయంగా ఉంటుంది. దేవతలు, దేవుళ్లు, నాగుపాములు, రాజుల ముఖారవిందాలు అద్భుతంగా శిల్పీకరించారు. ముఖద్వారం నుండి దేవాలయం లోపలికి వెళ్లగానే చుట్టూ పచ్చని పచ్చికతో అక్కడి వాతావరణమంతా ఆహ్లాదభరితంగా ఉంటుంది. ముఖద్వారం నుండే మూడు పెద్ద పెద్ద గోపురాలు దర్శనమిస్తాయి. ఇందులో మధ్య గోపురం నుండి లోపలికి వెళితే అనేక గోపురాలు కనిపిస్తాయి.

ఈ దేవాలయంలో మరో అద్భుతమైన ప్రదేశం పేరు బ్యాస్-రిలీఫ్స్ గ్యాలరీ. నాలుగు గోడలతో నిర్మించిన ఈ మండపంలో ఎక్కడ చూసినా హిందూ పురాణ గాథలే కనిపిస్తాయి. ముఖ్యంగా తూర్పున ఉన్న 'మంటన్' అనే గ్యాలరీ అందర్నీ ఆకట్టుకుటుంది. భారత పురాణాలైన రామాయణ, మహాభారత దృశ్యాలు ఇక్కడ మనకు సాక్షాత్కరిస్తాయి. దేవతలు, రాక్షసుల మధ్య జరిగిన క్షీరసాగర మథన దృశ్యాలు అందర్నీ ఆకట్టుకుంటాయి. తూర్పు వైపు మండపంలో విష్ణుమూర్తి పుట్టుక, అవతారాలకు సంబంధించిన శిల్పాలు ఉంటే పశ్చిమం వైపు మండపం గోడలపై యుద్ధాలు, మరణాలకు సంబంధించిన ఆకృతులు కనిపిస్తాయి. కురుక్షేత్ర యుద్ధం, రామ రావణ యుద్ధ సంఘటనలు ఎంతో చక్కగా మలచారు. ఇక దక్షిణ మండపంలో ఆలయాన్ని నిర్మించిన రాజు రెండవ సూర్యవర్మన్ రాజ్యానికి సంబంధించిన సైనిక పటాల



దృశ్యాలు దర్శనమిస్తాయి. ఇవేకాక పురాణ పురుషులు, మునులు, కిన్నెర కింపురుషాధి అప్సరసల నాట్య విన్యాసాలు, యుమధర్మరాజు కొలువు దీరిన యమసభ వంటి అనేక కళాఖండాలు అంగ్‌కోర్ వాట్ ఆలయ గోడలపై సాక్షాత్కరిస్తాయి. బాయన్ అనే ప్రాంతంలో కొన్ని కట్టడాలు శిథిలావస్థకు చేరుకుని కూలిపోయాయి. జపాన్‌వారి సహకారంతో వీటిని కొంతమేరకు పునరుద్ధరించారు. 2016లో కంబోడియాలోని అంకర్‌వాట్ ఆలయ సముదాయాన్ని చూడటానికి ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 50 లక్షల మంది పర్యాటకులు వచ్చారని అంచనా. కరోనా సమయంలో పర్యాటకుల రద్దీ తగ్గినప్పటికీ నేడు యాత్రికుల రద్దీ గణనీయంగా పెరగడంతో దేశ ఆదాయం కూడా పెరిగింది.

## బౌద్ధ మత ప్రభావం

అంగ్‌కోర్ వాట్‌లో బౌద్ధమత సంస్కృతి ఎక్కువగానే ఉంది. ఒక దశలో హిందూ ధర్మం, బౌద్ధం అధికార సంప్రదాయాలుగా విరాజిల్లినట్లు తెలుస్తుంది. ఏనుగుల మిద్దెలు, లెపర్ రాజు ప్రతిమలు, బెయాన్, బఫూన్ లాంటి అనేక నిర్మాణాలు ఇక్కడి ప్రత్యేకత. అంగ్‌కోర్ థోమ్ మధ్యలో చిన్న చిన్న మిద్దెలతో నిర్మించిన గోల్డెన్ టవర్(బెయాన్) ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. 54 అంతస్తులతో నిర్మించిన బెయాన్(బుద్ధుని) దేవాలయం అంగ్‌కోర్ థోమ్‌కి ఆకర్షణీయంగా నిలుస్తుంది. ఈ ఆలయ ద్వారాలు, గోపురాల మీద కనువిందు చేసే గంభీరమైన బుద్ధ విగ్రహాలు కనిపిస్తాయి. వీటిలో అనేకం శిథిలావస్థకు చేరాయి. కొన్ని చోట్ల గోడలపై మొక్కలు కూడా మొలిచాయి. వాటిని తొలగించి బాగుచేశారు. ఎలిఫెంటా మిద్దెగా పిలిచే ఒక నిర్మాణాన్ని ఫ్రాన్స్ వారు పునరుద్ధరించారు. ఆ తర్వాత బౌద్ధ సన్యాసులు కూడా ఇక్కడ నివసించారు. దీన్ని బౌద్ధారామంగా మార్చే ప్రయత్నం చేశారు. కానీ ఆలయంలో ఉన్న శిల్పాలను, దేవాలయాలను ఏమాత్రం మార్పులు చేయకుండా, కేవలం బుద్ధుడి విగ్రహాలను మాత్రమే అదనంగా ఏర్పాటు చేశారు.

20వ శతాబ్దం ప్రారంభం నుంచి ఈ ప్రాంతంలో పురావస్తు తవ్వకాలు జరుగుతున్నాయి. ఆ కారణంగా ఖ్మేర్ మత విశ్వాసాలు, కళాఖండాలు, ఆనాటి శిల్పకళా వైభవం చాలా వెలుగులోకి వచ్చాయి. అంగ్‌కోర్ వాట్ శిల్ప సౌందర్యాన్ని తిలకించడానికి అనునిత్యం వేలాది మంది ప్రపంచ పర్యాటకులు వస్తుంటారు.

---

**(22వ పేజీ తరువాయి..)**

## కర్మఫలం లభించేనా..

అవతలి పక్కవాళ్ల ఆలోచనతో పని" "రెండు జాతకాలను పోల్చి వివాహం జరపవలసిందిగా ఏ ధర్మశాస్త్రం చెప్పలేదు. జాతకాలు కూడా కేవలం కొన్ని సందర్భాలలోనే చూపించుకోవాలి". ఆశ్చర్యంగా చూసాడు సుబ్బారావు. నిజమే.

గీతను బోధించనివాడు లేదు. కర్మసిద్ధాంతం గురించి మాట్లాడనివాడు లేదు. అదేం చిత్రమో, సత్కార్యాన్ని ధైర్యంగా, ఆత్మబలంతో పరిశుద్ధంగా ఆచరించేవాడూ లేదు.

పవిత్రమైన వేదమంత్రాలను, అగ్నిహోత్రాన్ని, సౌశీల్యవతి అయిన స్త్రీని ఫొటోగ్రాఫర్ అరాచకాలకి అప్పజెప్పి నడిపించే దుస్థితిలోంచి సన్మార్గంలో నడవవలసిన మానవ సంబంధాలు, వైవాహిక సంబంధాలు ఎక్కడి నుండి పుట్టుకురాగలవు అనే అవగాహన ఈ రకం వివాహాలు జరిపిస్తున్న తల్లిదండ్రులకు రానంత వరకూ ఈ పరిస్థితి మారదు.

**- వేదాంతం శ్రీపతిశర్మ**



# వారఫలం


పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133


## మేషం



ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. వ్యాపారులకు సమస్యలుంటాయి. ఉద్యోగాభివృద్ధి బాగుంటుంది. ముఖ్యమైన పనుల్లో ఆటంకాలు ఏర్పడినా సకాలంలో పనులు పూర్తి చేస్తారు. సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు ఫలిస్తాయి. నూతన వాహన యోగం. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ఆరోగ్య సలహాలు పాటించండి.

## వృషభం



సామాన్యంగా ఉంటుంది. ప్రయాణ సూచనలున్నాయి. వారాంతంలో రుణాలు చేస్తారు. ధార్మిక చింతన అలవడుతుంది. శుభ కార్యాల్లో పాల్గొంటారు. విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఉద్యోగులకు బాగుంటుంది. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. బంధు, మిత్రులను కలుసుకుంటారు. వృథా ఖర్చులు ఉంటాయి.

## మిథునం



సంతానాభివృద్ధి సంతోషం కలిగిస్తుంది. పేరు ప్రతిష్టలు లభిస్తాయి. కుటుంబ ఖర్చులు అధికమవుతాయి. ఉద్యోగులకు బాగుంటుంది. శుభకార్యాల్లో పాల్గొంటారు. ఆరోగ్య సమస్యలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయకండి. శారీరక, మానసిక వత్తిడికి లోనవుతారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. శుభ వార్తలు వింటారు.

## కర్కాటం



ఖర్చులు అధికంగా ఉంటాయి. అనుకున్నది సాధించలేకపోవచ్చు. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. వ్యాపారులకు ఆర్థికంగా బాగుంటుంది. కీర్తి ప్రతిష్టలు లభిస్తాయి. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. బంధు, మిత్రులతో మనస్పర్థలుంటాయి.

## సింహం



పేరు ప్రతిష్టలు లభిస్తాయి. వృత్తి వ్యాపారులకు ఆశాజనకంగా ఉంటుంది. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయులను కలుసుకుంటారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. సామాన్య ధన లాభం. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. బంధు, మిత్రులతో మనస్పర్థలకు ఆస్కారముంది, సంయమనం పాటించండి. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.

## కన్య



వాహన యోగం. కుటుంబంలో మనస్పర్థలు తొలగిపోతాయి. దేశాంతర ప్రయాణ సూచనలున్నాయి. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ఆరోగ్య సలహాలు పాటించండి. అనుకున్నది సాధించలేకపోవచ్చు. ఆదాయానికి తగిన ఖర్చులు ఉంటాయి. విద్యార్థులకు పరీక్షల్లో అనూహ్య విజయం లభిస్తుంది. శుభ కార్యాల్లో పాల్గొంటారు.

## తుల



ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. సామాన్య ధన లాభం. విందు-వినోదాల్లో పాల్గొంటారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. ప్రయత్నాలు ఫలిస్తాయి. పేరు ప్రతిష్టలు లభిస్తాయి. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. ప్రముఖులను సందర్శిస్తారు. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి. మిత్రులను కలుసుకుంటారు.

## వృశ్చికం



ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ఉద్యోగులకు ఆర్థికంగా బాగుంటుంది. వ్యాపారులకు ఆశించిన ఫలితాలు ఉంటాయి. ఆరోగ్య సమస్యలను ఏమాత్రం నిర్లక్షం చేయకండి. వృథా కాలక్షేపం చేస్తారు. విలాసవంతమైన జీవితం పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. ఊహించని వార్తలు వింటారు. కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. ధర్మ రక్షణకై పాటుపడతారు.

## ధనుస్సు



ఖర్చులకు తగిన ఆదాయం సమకూర్చుకుంటారు. శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఉద్యోగాభివృద్ధి సంతృప్తినిస్తుంది. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. వృత్తి వ్యాపారులకు చెప్పుకోదగిన ఆర్థిక లాభాలు ఉండకపోవచ్చు. సాహస యాత్రలు చేస్తారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరించడం మంచిది. ఎదురు చూస్తున్న సమాచారం తెలుస్తుంది.

## మకరం



వృత్తి వ్యాపారులకు బాగుంటుంది. ఆరోగ్య సలహాలు, సూచనలు తూచా తప్పకుండా పాటించండి. బంధు, మిత్రులను కలుసుకుంటారు. వారాంతంలో రుణాలు తీరుస్తారు. చిరు వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. కోర్టు వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. ముఖ్యమైన చర్చలు ఒక కొలిక్కి వస్తాయి. విద్యార్థులకు పరీక్షల్లో విజయం. విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి.

## కుంభం



అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ఉద్యోగులకు పనివత్తిడి ఉంటుంది. వృత్తి రంగాల్లో వున్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. భాగస్వామ్య వ్యాపారులకు సమస్యలుంటాయి. మనోధైర్యంతో క్లిష్ట సమస్యలను సైతం ఎదుర్కొంటారు. సంతానాభివృద్ధి సంతృప్తినిస్తుంది. సంయమనం పాటిస్తే మరిన్ని విజయాలు మీ సొంతమవుతాయి.

## మీనం



ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది. వృత్తి వ్యాపారులకు పోటీ వున్నా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. ధర్మ రక్షణకై పాటుపడతారు. ఉద్యోగులకు ఉన్నత పదవి లభిస్తుంది. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. దూర ప్రాంత ప్రయాణం చేస్తారు. ప్రముఖులను సందర్శిస్తారు. ఆకస్మిక ధన లాభ సూచనలున్నాయి. శుభకార్యాల్లో పాల్గొంటారు.

వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్స్: 9885446501/9885449458


# బావి ఏ దిక్కులో ఉండాలి?

ఇల్లాలు వంటింటికి ఎలా పరిమితం కాదో, అలాగే బావులు నీటివనరుల కోసమే పరిమితం కాదు. ఇల్లాలు తన పిల్లల జీవితాలను తీర్చిదిద్దుతుంటే, బావులు వారి భావితరాలనే తీర్చిదిద్దుతాయి. అయితే ఇల్లాలికి భర్త సహకారం ఎంత అవసరమో ఒక ఇంటి బావికి దిక్కుల సమన్వయం కూడా అంతే అవసరం.

## ఈశాన్య బావి-అశుభం

ఈశాన్యంలో బావి తవ్వటం శుభమని, స్థలానికి పూర్తి 'ఈశాన్యమూల'లో బావి తవ్విస్తారు. ఇలా బావి తవ్వితే తర్వాత ఇల్లు కట్టాక ఆ ఇంటి ఈశాన్య మూల నుండి స్థల ఈశాన్య మూల వరకూ తాడు పట్టి లాగి చూస్తే అది బావి మీదుగా పోతుంది. అది 'బావిపోటు' దోషమవుతుంది. **శుభా శుభ ఫలితాలు:** మంచి కంటే చెడు ఎక్కువ జరిగే అవకాశాలున్నాయి.

## North-Eastern Well-Unfavourable

Believing that digging a well in the North-East is beneficial, generally a well is completely dug is the North-East of the plot. However, after digging a well thus and after constructing a house, if a string is held straight from the North-East corner of the house to the North-East corner of the plot, it will be seen that it passes over the well. This is a flaw of strike of well.

**Likely Result:** Causes more harm than good.

## ఉత్తర ఈశాన్య బావి-శుభం

ఇంటి తూర్పు పారు నుండి ఈశాన్య మూల నుండిగానీ, పోటు లేకుండా ఉత్తర ఈశాన్యంలో బావి తవ్వటం వలన మంచి ఫలితాలు ఉంటాయి.

**శుభా శుభ ఫలితాలు:** ఇంటిల్లిపాదికి సుఖవంతమైన జీవితం, ధన ధాన్య సమృద్ధి కలుగుతుంది.

## North North-Eastern Well-Favourable

A well, dug in the North North-East, either from the Eastern side of the house or from its North-Eastern corner, without giving rise to a strike, fetches favourable results. **Likely Result:** Brings prosperity, residents lead a happy life.

## ఉత్తర/ఉత్తర ఈశాన్య బావిపోటు-అశుభం

ఇంటి తూర్పు పారు నుండి ఉత్తర ప్రహరీ గోడకు నేరుగా తాడు పట్టి లాగినప్పుడు మధ్యలో బావి వచ్చినట్లయితే అది ఉత్తర/ఉత్తర ఈశాన్య బావిపోటుగా గుర్తించబడుతుంది. ఉత్తరంలో బావి సత్ఫలితాలనే ఇస్తుంది. కానీ ఇలా పోటు వచ్చినప్పుడు సత్ఫలితాలు ఉండవు.



**శుభా శుభ ఫలితాలు:** ఆర్థిక బాధలు, స్త్రీలకు మనో రుగ్మతలకు అవకాశం.

## Northern/North, North-Eastern Well(strike)-unvafourable

If a string is held straight from the Eastern border of the house to the Northern compound wall it will be seen that it passes over the well. This is a flaw of strike of the well. **Likely Result:** Monetary difficulties, women likely to become mentally ill.

## ఉత్తర బావి(ఉచ్ఛమ స్థానం) శుభం

మధ్య ఉత్తరంలో కాక, ఈశాన్యం వైపు అంటే ఉచ్ఛమ స్థానం వైపు ఇంటి నుండి పోటు లేకుండా ఉత్తరంలో బావి తవ్వినట్లయితే అది ఉత్తర బావి (ఉచ్ఛమ) అవుతుంది. ఇటువంటి బావుల చుట్టూ నేల తూర్పు/ఉత్తరాలుగా పల్లం వున్నట్లయితే శుభ ఫలితాలు మరింతగా ఉంటాయి. **శుభా శుభ ఫలితాలు:**సమాజంలో పలుకుబడి, వివిధ వ్యాపార వ్యవహారాలలో ధన సంపాదన.

## Northern Well(High-grade location)-Favourable

If a well is dug in the middle of the North or towards the North-East, i.e. towards a high-grade location, without giving rise to a strike, it becomes a Northern Well(High grade location). If the ground surrounding the well is at lower-level in the East or North, the favourable effects get increased. **Likely Result:** Good status, good earnings from business deals.

## ఉత్తర బావి (మధ్యమ స్థానం)శుభం

ఉత్తరపు మధ్య భాగంలో బావి తవ్వినట్లయితే మంచి ఫలితాలుంటాయి. అది ఉత్తర బావి (మధ్యమ స్థానం) అవుతుంది. ఇటువంటి బావుల చుట్టూ నేల తూర్పు/ఉత్తరాలుగా పల్లం వున్నట్లయితే శుభ ఫలితాలు మరింతగా ఉంటాయి. **శుభాశుభ ఫలితాలు:** ధన లాభం, పొదుపు, స్త్రీలకు మనోల్లాసం.

## Northern Well (Medium-grade location)-Favourable

If a well is dug in the middle of the North, it gives gainful results. It becomes a Northern Well(Medium-grade location). If the ground surrounding the well is at lower level in the East or North, the favorable effects get increased. **Likely Result:** Monetary gains, good savings, women become cheerful.

సింగిల్ పేజీ కథ

# ఇంటర్‌సిటీ ప్యాసింజర్

రైలు కూతలేసుకుంటూ రాజంపేట దాటి నందలూరు వైపు పోదామా, వద్దా అనుకుంటూ చెయ్యేరు బ్రిడ్జి పైకి వచ్చింది. నదిలో ఒక్క చుక్క నీరు లేదు.

సూరీడుకి దాహం వేసి నీరంతా తాగేసినట్లున్నాడు.

బోగీలో ఓ మూలన గళ్లలుంగి పంచె, సన్నగీతల సొక్కా ఏసుకొని మాసిన తెల్లటి గడ్డంతో ఆ పక్కనే ఉన్న లక్ష్మీదేవమ్మతో "ఏ వూరమ్మా మీది, యాడికి పోతావుండారిక్కడ?" అన్నాడు సుబ్బయ్య.

"తాడిపత్రన్న మాది"

మీది అనగానే వెంటనే సుబ్బయ్య ఆత్రంగా ఏటిలోకి వరదొచ్చినట్లు, ఎండిన గొంతు తడిసినట్టు "అబ్బా, మాది తాడిపత్రే. నిన్న ఈ పక్క ఇచ్చినారామ్మా?" అంటూ భుజానికున్న తుండుగుడ్డ సరిచేసుకున్నాడు.

మాట్లాడేవారు లేక ఒంటరిగా ఉన్న లక్ష్మికి నోటినిండా, బుర్ర నిండా పని దొరికింది.

"లేదన్నా, మా ఆయన, మా వాళ్లు అదో ఆడ... కింద కూర్చొండారు, ఈ పక్క బేల్దారి పనికొచ్చినాం, ఓ షావుకారి కాడ నాలుగు నెల్ల నుంచీ వుండాం"

"మరి నువ్వన్నా ఇక్కడేమి అమ్మినిచ్చినావా అనగానే సుబ్బయ్య "లేదమ్మా, ఇక్కడే ఇటుకల పనిలో బట్టీకాడ పని" పాపను మన పక్కే ఇచ్చిన.

కొడుకు బెంగళూరులో కంపెనీలో ఉండాడు. నేను, ఆమె పనిలో ఎనిమిదేండ్ల నుంచి వున్నాం" అంటూ మెల్లిగా సుబ్బయ్య ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందినోడిలా లెక్కలు తీయడం మొదలుపెట్టాడు.

"ఎంతిస్తారమ్మా?" అన్నాడు మెల్లగా.

"రోజుకు 350 ఇస్తారన్నా. మధ్యాన్నం సంకటి వాళ్లదేలే" అంటూ గర్వంగా చెప్తూ నిమిషమైనా ఆలస్యం చేయకుండా-

"నీకెంతిస్తారన్నా?" అన్నది.

"మాకు ఇటుకకు రూపాయిలెక్క రోజుకు 3000 ఇటుక చేస్తాం, వారానికి 18000 వస్తాది".

"అబ్బా! మంచి లెక్కే" అంటున్న లక్ష్మి వైపు చూస్తూ "ఇదేముంది.. పనికాడే రూమొకటిస్తారు. బియ్యం, బేడలు, సబ్బులు అన్నీ ఆల్లవేలే. పోయిన ఏడూ మూడు లచ్చలు ఇచ్చినారు, మా యామాకు బాలేకుంటే. ఇద్దరం పని కింద రెండు లచ్చలు చెల్లగొట్టేసినాం. మంచి లెక్క, కాకపోతే పని చాలా కష్టం. దో ఇంతెత్తు గోళాలు మొయ్యాల, ఆడోళ్లకి కష్టంలేమ్మో!" అంటూ పనిలోని కష్టాలను ఎంతో ఇష్టంగా చెప్పుకొస్తుంటే నిలిచిపోయిన రైలుబండికి ఆకుపచ్చ సిగ్నలిచ్చినట్లు వెలిగిపోతున్నాయి లక్ష్మి కళ్లు.

"ఐతే బానే కూడబెట్టినట్టన్నావే" అంటూ ఉరకలు వేస్తున్న సూపర్ ఫాస్ట్ రైలు బండిలాగా అడిగింది లక్ష్మి.

"యాదిలేమ్మా.. సెప్పినా కదా మా యామెకు బాలేదని. అంతా మందు-మాకులకే సరిపోయినాది" అంటూ బాధను పంచుకోవడం ఇష్టం లేకనో, మరి బతుకు ఎదుటివారికి వివరించలేకనో మౌనంగా కిటికీలోంచి చూస్తూ, కరువుసీమలోకి పలకరింపుగా వచ్చిన తొలకరి చినుకులాగా ఒక్క నవ్వు మొహంపై విదిలించి చూస్తూ కూర్చుండిపోయాడు.

ఇదంతా అర్థం చేసుకున్నదానిలాగా లక్ష్మి మౌన మునిని పోలినదానిలా వూరకుండిపోయింది.

ఇక్కడ ఏదో వెలితయిందని రూలు కూడా వేగం తగ్గించింది. ఇలా కాదని తేరుకున్న సుబ్బయ్య "పల్లెకాడ మంచి ఇల్లు కట్టినాలేమ్మా, ముందు ఆన్నే ఉన్యాం కదా" అనగానే-


ఆలస్యం చేయక లక్ష్మి "ముందేం పనికి పోయటోడివి" అంటుండగానే అందరికీ వినపడాలనో ఏమో "మా ఊరి పక్కన అడివిలో కట్టెలు కొట్టేటోన్ని. ఇప్పుడు అడవి లేదు, కట్టెలు లేవు. ఆ తల్లి శాపం తగిలిందో ఏమో! ఇప్పుడు యాడో కూలిపనికి పోవాల్సొస్తోంది" అంటూ బతుకులోని కర్మ సిద్ధాంతాన్ని వల్లె వేస్తుంటే రైలు చక చక గమ్య స్థానం వైపుకు చేరి తాడిపత్రి స్టేషను మీకు స్వాగతం పలుకుతోంది అంటూ వారిపై కురిపిస్తున్న ప్రేమకు బానిసలలాగా దిగి మౌనంగా పోయొస్తామని చెప్పుకుంటూ కదిలి పరుగుల ప్రపంచంలోకి పనికట్టుకుపోతున్నారు.





ఇంతలో మళ్లీ "తిరుపతి నుండి హుబ్లీ వెళ్లవలసిన ఇంటర్ సిటీ ప్యాసింజర్ బయలుదేరుటకు సిద్ధంగా వుంది" అంటూ కదిలిపోతున్న రైలులో మళ్లీ ఇలాంటి మాటల వీణలు ఎన్నో మోగడం ప్రారంభించాయి.

**- సింగంపల్లి శేషసాయి కుమార్**

# ఈ వారం కా'ర్టూన్స్'


పిల్లర్ల లైఫ్ ఐపోయింది సార్..
కొత్త పిల్లర్లు వేయాలి..!!
Zakir...


సూర్యుడు ఐస్క్రీం అన్నాడు!
..వావ్! కోడ్ కరెక్ట్.. డైమండ్స్ సూట్‌కేసులిచ్చి
టమోటాల సూట్‌కేస్ తీస్కెళ్లు.. క్విక్..!!
Zakir...


ప్లీజ్ అమ్మా.. నేనొక్కసారి ఊగుతా..!!
పిల్లల పార్కు
Zakir...



నెదర్లాండ్స్‌లో వున్న ఈ సరస్సును వింకేవీన్ సరస్సు అంటారు. సరస్సు మధ్యలో పొడుగ్గా వీధులను తలపించేలా ఇళ్లు ఉండటం దీని ప్రత్యేకత. ఇందులో తోటలు, పర్యాటకుల కోసం హోటళ్లు, అద్దె ఇళ్లు సైతం వున్నాయి. ఇక చెప్పేదేముంది! ఈ సరస్సును, అందులోని తోటలు, ఇళ్లను చూడటానికి పర్యాటకులు పడవలేసుకుని రావడం మామూలేగా!









ఫోటో ఫీచర్

